## తెలంగాణ పరువు తీస్తున్న రేవంత్ రెడ్డి



యాక్సిడెంటల్ సిఎం అంటూ విమర్శలు
దమ్ముంటే ఏడాది పాలనపై అసెంబ్లీలో చర్చ చేద్దాం
బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ సవాల్

2వ పేజీలో...

## మా బీసీ లెక్కలన్నీ పక్కా



- తొలి అడుగుగా తెలంగాణ నుంచే ప్రారంభించాం
- ఆ ఘనత నాకు దక్కడం అదృష్టం
- కెసిఆర్ వి అన్ని దొంగ లెక్కలే
- బిసి నేతల సమావేశంలో రేవంత్ రెడ్డి ఉద్ఘాటన

**హైదరాబాద్, యదార్థవాది ప్రతినిధి, ఫిబ్రవరి 22:** కులగణన విషయంలో ఎంతో మంది రాష్ట్రానికి సీఎంలుగా పనిచేసినా ఎవరికీ రాని అవకాశం తనకు వచ్చిందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. తెలంగాణ మోడల్‌ను దేశం మొత్తం అమలు చేయాలనే కార్యాచరణను రాహుల్ గాంధీ సిద్ధం చేస్తున్నారని అన్నారు. ప్రజాభవన్ లో శనివారం జరిగిన బిసి నేతల సమావేశంలో ఆయన మాట్లాడుతూ॥% అందుకే బీజేపీ నేతలు కులగణనను తప్పుబడుతున్నారన్నారు. కులగణన సర్వేను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత బీసీలదేనని.. అంతా తానే చూసుకుంటానని అనుకోవడం సరికాదని తెలిపారు. ఎన్నో జాగ్రత్తలు తీసుకుని శాస్త్రీయంగా కులగణ సర్వే నిర్వహించామని లెక్కలు తప్పు అని కొందరు విమర్శిస్తున్నారని.. ఎక్కడ తప్పు ఉందో బీఆర్ఎస్, బీజేపీ నేతలు చెప్పాలని సవాల్ విసిరారు.

2వ పేజీలో...



## టన్నెల్ ప్రమాద ఘటనపై మోడీ

### -సిఎం రేవంత్ రెడ్డికి ఫోన్ చేసి తెలుసుకున్న ప్రధాని

**హైదరాబాద్, యదార్థవాది ప్రతినిధి, ఫిబ్రవరి 22:** ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాద ఘటనపై ప్రధాని మోడీ ఆరా తీశారు. ఈ మేరకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఫోన్ చేశారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలను రేవంత్‌రెడ్డి.. ప్రధానికి వివరించారు. సొరంగంలో ఎనిమిది మంది చిక్కుకున్నారని, వారిని కాపాడేందుకు సహాయక చర్యలు చేపట్టినట్టు తెలిపారు. మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారని వెల్లడించారు. ఘటనా స్థలికి ఎన్డీఆర్ఎఫ్ బృందాలను పంపిస్తున్నట్టు ప్రధాని మోదీ.. సీఎంకు చెప్పారు. పూర్తి స్థాయిలో సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే 3 ఎన్డీఆర్ఎఫ్ బృందాలు టన్నెల్ వద్దకు చేరుకున్నాయి. విజయవాడ నుంచి రెండు, హైదరాబాద్ నుంచి ఒక బృందం ఘటనా స్థలికి చేరుకున్నాయి. సింగరేణి నిపుణుల బృందం కూడా అక్కడికి వెళ్లనుంది. నాగర్‌కర్నూల్ కలెక్టర్, ఎస్పీ ఘటనా స్థలిలోనే ఉండి సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని దోమలపెంట సమీపంలో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్ద శనివారం ఉదయం ప్రమాదం చోటుచేసుకుంది. ఎడమవైపు సొరంగం 14వ కిలోమీటర్ వద్ద మూడు మీటర్ల మేర పైకప్పు పడిపోయింది. ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయాలనే లక్ష్యంతో ఇటీవల ప్రభుత్వం పనులను తిరిగి ప్రారంభించింది. ఇందులో భాగంగా నాలుగు రోజుల క్రితం పనులు ప్రారంభమయ్యాయి. ఈ ఉదయం మొదటి షిఫ్ట్‌లో సుమారు 50 మంది కార్మికులు సొరంగంలోకి వెళ్లారు. ఉదయం 8.30 గంటల సమయంలో కార్మికులు పని చేస్తుండగా.. అకస్మాతుగా పైకప్పు కూలింది. దీంతో కార్మికులు భయాందోళనకు గురయ్యారు. వారిలో 42 మంది బయటకి రాగా.. 8 మంది కార్మికులు లోపల చిక్కుకున్నారు.



2వ పేజీలో...

## అంతు పట్టని దళపతి వ్యూహం

### ఆత్మ స్తుతి, పరనింద

**హైదరాబాద్, యదార్థవాది ప్రతినిధి, ఫిబ్రవరి 22:** నెలల లాంగ్ రెస్ట్ తర్వాత గులాబీ బాస్ జనంలోకి వచ్చారు. పార్టీ ఆఫీస్ లో మీటింగ్ పెట్టారు. ఇంత చేసి భవిష్యత్ పై దిశానిర్దేశం చేస్తారని చాలా మంది గులాబీ లీడర్లు అనుకున్నారు. కానీ కేసీఆర్ మాత్రం తెలంగాణ ఉద్యమ చరిత్ర ? బీఆర్ఎస్ పాత్రపై గంటలు గంటలు మాట్లాడారు. మళ్లీ సెంటిమెంట్ రగిల్చి లాభపడే ఉద్దేశమే తప్ప.. భవిష్యత్ లో ఏం చేద్దాం.. ఎలా ముందుకెళ్దాం అన్న పాయింట్లు లేకుండా పోయా యన్న వాదన వినిపిస్తోంది. ఆత్మ స్తుతి, పరనింద ఇదేనా గులాబీ బాస్ కొత్త సందేశం?మరోసారి తెలంగాణ ఉద్యమ చరిత్ర, అందులో కేసీఆర్ పాత్ర, సెంటిమెంట్ చుట్టూనే మ్యాటర్ మొత్తం తిప్పారు. పార్టీ నేతలతో మాట్లాడిన స్పీచ్ లో ఎక్కువ దానికే కేటాయించారు. ఎక్కడైనా చేసిన పని గెలిపిస్తుంది. నిలబెడుతుంది. ఇంకా ఎన్నాళ్లు సెంటిమెంట్ ను పట్టుకుంటారన్న విమర్శలను ప్రత్యర్థులు వినిపిస్తు న్నారు. ఇంత చేసి గత పదేళ్లలో ఉద్యమకారులకు కేసీఆర్ ఏపాటి గౌరవం ఇచ్చారన్న ప్రశ్నలు వచ్చి పడుతున్నాయ్.రాకరాక జనంలోకి వచ్చి పార్టీని ఎలా జనంలోకి తీసుకెళ్లాలన్న విషయంపై దిశానిర్దేశం చేసుకోవాలి. కానీ విస్తృతస్థాయి మీటింగ్ లో అలా జరగలేదు. ఏదో అనుకుని ఇంకేదో చెప్పారా.. అన్న టాక్ ఇంటర్నల్ గా నడుస్తోంది. తమ పాలన భేష్, కాంగ్రెస్ పాలన బేకార్ అన్నట్లుగా మాట్లాడారు. అన్ని రంగాలు పడకేశాయన్నారు. అన్ని వర్గాల వారు రోడ్డు న పడ్డారన్నారు. ప్రతిపక్ష నేతగా ఇవన్నీ రొటీన్ డైలాగ్స్. అయితే కొంత వరకైనా కనెక్ట్ అయ్యేలా ఉండాలి కదా అన్న పాయింట్ ను ప్రత్యర్థులు వినిపిస్తు న్నారు.బీఆర్ఎస్ పార్టీ ఇప్పుడు ఏ పొజిషన్ లో ఉంది.



2వ పేజీలో...

## కులగణనతో బిసిల భవిష్యత్ అంధకారం

### కాంగ్రెస్ తీరుపై మండిపడ్డ కిషన్ రెడ్డి

**నిజామాబాద్, యదార్థవాది ప్రతినిధి, ఫిబ్రవరి 22:** రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపిస్తుందని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి ఆరోపించారు . శనివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కులగణన వల్ల రానున్న కాలంలో బీసీల భవిష్యత్ అంధకారంగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.



## వైసీపీకి సేనాని సెగ..

### పవన్ పై కామెంట్స్ కు దూరం

విజయవాడ, యదార్థవాది ప్రతినిధి, ఫిబ్రవరి 22 : ఎన్నికల్లో అంత ఘోరంగా ఓడడానికి కారణాలేంటని విశ్లేషించుకుంటున్న టైమ్‌లో ఆ ఒక్కడి జోలికి వెళ్లకుంటే బాగుండేదని..నేతల తమ మనోగతం బయటపెట్టారట. పవన్‌ను పర్సనల్‌గా అటాక్ చేయడం వల్లే కాపులు తమకు దూరమయ్యారని భావిస్తున్నారట వైసీపీ నేతలు. సేనానిని విమర్శించడం వల్ల యూత్ ఓట్లు కూడా తమకు పోలరైజ్ కాలేదని అనుకుంటున్నారట. పలువురు నేతల సూచనల ప్రభావమో..లేక వైసీపీ అధినేతే వాస్తవాలను గమనించారో తెలియదు కానీ..సేనాని జోలికి మాత్రం వెళ్లడం లేదంటున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు పవన్ లక్ష్యంగా మాటల తూటాలు పేల్చేవారు వైసీపీ నేతలు. జగన్‌తో సహా ఆయన మౌత్ పీస్‌లుగా ఉన్న నేతలంతా.. సేనానిని గట్టిగా అటాక్ చేసేవారు. పవన్ రెండు పెళ్లిళ్లు చేసుకున్నారని..చంద్రబాబుకు దత్తపుత్రుడని విమర్శించేవారు.

2వ పేజీలో...

## మహిళలకు నెలనెలా... 2500 పథకం

### చర్చించేందకు అవకాశం ఇవ్వండి సిఎం రేఖాగుప్తాకు మాజీ సిఎం అతిషి లేఖ

**న్యూఢిల్లీ, యదార్థవాది ప్రతినిధి, ఫిబ్రవరి22 :** ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తాకు మాజీ ముఖ్యమంత్రి, ఆప్ నేత అతిషి లేఖ రాశారు. మహిళలకు నెలకు రూ.2500 ఇచ్చే పథకం గురించి చర్చించేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు.



2వ పేజీలో...

## కుంభమేళాకు కొనసాగుతున్న తాకిడి

### 60కోట్ల మంది వచ్చారని వెల్లడించిన యోగి

**లక్నో, యదార్థవాది ప్రతినిధి, ఫిబ్రవరి 22 :** ప్రయాగ్‌రాజ్‌లో కొనసాగుతోన్న కుంభమేళాకు పెద్దఎత్తున భక్తులు పోటెత్తుతున్నారు. కుంభమేళా తుదిదశకు చేరుకోవడంతో రోజురోజుకు భక్తుల రాక పెరుగుతోంది. పవిత్ర త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు చేసేందకు భారీగా తరలి వస్తున్నారు. ఈ క్రమంలో అయోధ్య, వారణాసిలను సందర్శించుకు నేందుకు వెళ్లడంతో అక్కడా భక్తజనసందోహంగా మారింది.



2వ పేజీలో...



మొదటిపేజీ తరువాయి...

న్యాయపరంగా ఇబ్బందులు రావొద్దనే రెండోసారి కులగణన సర్వేకు అవకాశం కల్పించామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. స్వాతంత్రం వచ్చాక ఇప్పటి వరకు బీసీల లెక్కలు ఎవరూ తీయలేదని గుర్తు చేశారు రేవంత్. రిజర్వేషన్ల విషయంలో బీసీ సంఘాలు డిమాండ్ చేయకముందే రాహుల్ హామీ ఇచ్చారని తెలిపారు. రాహుల్ గాంధీ హామీ మేరకు సీఎంగా చిత్తశుద్ధితో పనిచేస్తున్నానని అన్నారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయలేని సాహసానికి తాను పూనుకున్నట్లుగా పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సకలజనుల సర్వే పేరుతో కేసీఆర్ కాకి లెక్కలు చెప్పారని ఆ సర్వేలో తప్పులు ఉన్నాయి కాబట్టే లెక్కలు అధికారికంగా బయట పెట్టలేదని అన్నారు. 150ఇళ్లను క్లస్టర్‌గా తీసుకుని అత్యంత పకడ్బందీగా తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పారదర్శకంగా సర్వే చేపట్టామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర సర్వేలో తప్పులు ఎక్కడ ఉన్నాయో చూపించాలని సవాల్ విసిరారు. గణాంకాలు మా ఇష్టపూర్వకంగా తాము రాయలేదని.. ఇంటి యజమాని స్వయంగా చెప్పిన లెక్కలే మా సర్వేలో ఉన్నాయని స్పష్టం చేశారు. తమ లెక్కలను తప్పని చెప్పే వాళ్లు ఎక్కడైనా వెరిఫై చేసుకోవచ్చని అన్నారు. పారదర్శకంగా సర్వే చేస్తే విపక్షాలు తప్పని విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందని కామెంట్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సర్వేలో కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు ఎందుకు వివరాలు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఓసీల సంఖ్యను కేసీఆర్ తన సకలజనుల సర్వేలో 21శాతంగా చూపించారని వాస్తవానికి తాము చేపట్టిన సమగ్ర సర్వేలో వారు 17శాతమే ఉన్నట్లుగా తేలిందన్నారు. ఇక్కడే తప్పు ఎవరు చేశారో తేటతెల్లం అవుతోందని సెటైర్లు వేశారు. గుజరాత్ లో ముస్లీంలను బిసిలలో మోడీ కలిపారని అంటూ తమ ప్రభుత్వం రాష్ట్రంలోని ముస్లింలను బీసీల్లో కలిపితే బండి సంజయ్ ఎట్లా విమర్శిస్తారని ఫైర్ అయ్యారు.



కులగణనపై తమతో చర్చకు వస్తామని కాంగ్రెస్ చెప్పడం హాస్యస్పదంగా ఉందని పేర్కొన్నారు. తాము చర్చలకు సిద్ధంగానే ఉన్నామని, దానికి ముందు వారు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చిన అనంతరం తమతో చర్చలకు రావాలని కిషన్ రెడ్డి సవాల్ విసిరారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తుందని విమర్శించారు. అధికారంలోకి రాక ముందు వంద రోజుల్లో వాగ్దానాలు పూరి చేస్తామని మాటిచ్చిన కాంగ్రెస్, 400 రోజులు గడుస్తున్న వారిచ్చిన వాగ్దానాలు అమలుకు నోచుకోలేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ కంటున్న కలలు నీరుగారి పోతున్నాయని, దేశంలో జరుగుతున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి వచ్చింది గాడిద గుడ్డేనని విమర్శించారు. అందుకు ఢిల్లీ ఎన్నికలే నిదర్శనమని కేంద్రమంత్రి అన్నారు. రిజర్వేషన్ల పేరుతో కాంగ్రెస్ పార్టీ బీసీలకు తీవ్ర అన్యాయం చేస్తుందని, బీసీలు కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెబుతారని వెల్లడించారు. ఈ సమావేశంలో జాతీయ పసుపు బోర్డు చైర్మన్ ఫ్లలె గంగారెడ్డి, ఎంపీ అరవింద్, అర్బన్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ కులచారి, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# వైసీపీకి సేనాని సెగ..

మొదటిపేజీ తరువాయి...

అలా పవన్‌ను ఒంటరిని చేయడం లేదా పవన్ రాజకీయ ఎత్తుగడలను చిత్తు చేస్తే చాలు తనదే అధికారమనే భావనలో ఉండేవారట వైసీపీ లీడర్లు. అందుకే అప్పుడు ఎక్కడికి వెళ్లినా పవన్‌పై పర్సనల్ అటాకింగ్ చేసేవారని అంటున్నారు. వైసీపీ సోషల్ మీడియాలో కూడా జనసే నానినే టార్గెట్ చేసేవారు. అయితే ఎన్నికల ఫలితాల తర్వాత సేనాని సెగ ఏంటో తెలిసి వచ్చిందంటున్నారు. పవన్‌పై ఎక్కుపెట్టిన బాణాలు మిస్ ఫైర్ అయ్యాయనే అభిప్రాయానికి వచ్చారట. అందుకే ప్రభుత్వం లో కీలకంగా వ్యవహరిస్తున్న డిప్యూటీ సీఎం పవన్‌పై విమర్శలు తగ్గించి, సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌నే టార్గెట్ చేస్తున్నారని పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. గతంలో పవన్‌ను ఎక్కువగా టార్గెట్ చేయడం వల్లే తమకు తీవ్ర నష్టం జరిగిందని పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తుందట. ఆ కారణంగానే జగన్ తన స్వరాన్ని సవరించారన్న టాక్ వినిపిస్తోంది. పవన్, చంద్రబాబును విడదీసి పాలిటిక్స్ ప్లే చేయాలనుకున్నారట. కానీ వైసీపీ ఎత్తులు తలకిందులు అవ్వడమే కాకుండా పవన్, చంద్రబాబు మధ్య బంధం మరింత బలపడింది. పవన్ ఒంటరిగా పోటీ చేస్తే ఓట్లు చీలి తాను మళ్లీ అధికారంలోకి వస్తామని జగన్ అండ్ కో స్కెచ్ అనుకునేవారట. అందుకే చంద్రబాబు కన్నా ఎక్కువగా పవన్ వెంట పడేవారట. కానీ జగన్ అంచనాకు భిన్నంగా ఆ ఇద్దరూ ఒక్కటవ్వడంతో అధికారం వైసీపీ చేతుల నుంచి జారిపోయిందంటున్నారు. ఎన్నికల తర్వాత కార్యకర్తలు, పలువురు నేతలతో పలుమార్లు మాట్లాడిన జగన్..పవన్ విషయంలో విమర్శల డోస్ఎక్కువైందన్న విషయాన్ని గ్రహించారట. అందుకే ఇప్పుడు ఆయన జోలికి వెళ్లకుండా సీఎం చంద్రబాబు,మంత్రి లోకేశ్‌నుమాత్రమే టార్గెట్ చేస్తున్నారని అంటున్నారు. మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీతో ములాఖత్ అయ్యేందుకు విజయవాడ సబ్‌జైలుకు వెళ్లిన జగన్..మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు, లోకేశ్‌పైనే తీవ్ర విమర్శలు చేశారు. అరగంటసేపు మీడియాతో మాట్లాడిన జగన్ కూటమి ప్రభుత్వంలో అత్యంత కీలకంగా పనిచేస్తున్న డిప్యూటీ సీఎం పవన్‌ను ఒక్కమాట




కూడా ఆడలేదు. ప్రభుత్వం అరెస్టులు చేస్తుంటే పవన్ ఏం చేస్తున్నారన్న ప్రశ్న కూడా వేయలేదన్న చర్చ జరుగుతోంది. ఇది జగన్‌లో మారిన వైఖరికి ఎగ్జాంమ్‌పుల్ అని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. డిప్యూటీ సీఎం హోదాలో పవన్ మాట్లాడిన తర్వాతే వైసీపీ సోషల్ మీడియా అరెస్టులు జరిగాయని, పవన్‌ను రెచ్చగొడితే రాజకీయంగా జరిగే లాభం కన్నా, నష్టమే ఎక్కువగా ఉంటోందని వైసీపీ నేతలు అభిప్రాయపడుతున్నారు. అందుకే తమ అధినేతకు చెప్పి..పవన్ విషయంలో సాఫ్ట్‌గా మాట్లాడాలని..అవసరమతే ఆయన ప్రస్తావన తేకపోవడమే బెటరని సూచించినట్లు తెలుస్తోంది. తమ సూచనతో జగన్ రూట్ మార్చారని పలువురు వైసీపీ లీడర్లు గుసగుసలు పెట్టుకుంటున్నారు. జగన్ మద్దతుదారులుగా ఉన్నవారు కూడా పవన్‌కు అనుకూలంగా జపం చేస్తున్నారు. రేపోమాపో వైసీపీలో చేరబోతున్నా రంటున్న మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ అయితే ఏపీకి ఆశాకిర ణం పవన్ ఒక్కడేనని ఆకాశానికి ఎత్తుతున్నారు. కేంద్రం నుంచి ఏపీకి ఏది సాధించాలన్న పవన్‌తోనే సాధ్యం అవుతదని చెప్పుకొచ్చారు. ఇక మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి అయితే ఎన్నికల ఫలితాల తర్వాత పవన్‌ను తక్కువ అంచనా వేశామని ఒప్పుకున్నారు. యూత్‌లో పవన్‌కు ఉన్న క్రేజ్..కూటమి బంపర్ విక్టరీకి ఉపయోగపడిందని కూడా చెప్పేశారు. లాస్ట్‌కు వైసీపీని వీడిన విజయసాయిరెడ్డి కూడా పవన్ పట్ల సాఫ్ట్ వాయిస్ వినిపించారు. ఇలా వైసీపీ అధినేత సన్నిహితులుగా ఉన్నవారంతా పవన్‌ను పొగుడుతున్నారు. జగన్ మాత్రం పవన్ పేరెత్తకుండా జాగ్రత్త పడుతున్నారు. దీంతో సేనాని సెగ వైసీపీకి గట్టిగానే తాకిందన్న చర్చ జరుగుతోంది.

# తెలంగాణ పరువు తీస్తున్న రేవంత్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి...

హైదరాబాద్, యదార్థవాది ప్రతినిధి, ఫిబ్రవరి22 : కాంగ్రెస్ ఏడాది పాలనపై అసెంబ్లీలో చర్చించేందుకు సిద్దమా అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ చేశారు. తెలంగాణ ఆర్థిక స్థితిపై అసెంబ్లీలో చర్చకు పెట్టాలని డిమాండ్ చేశారు. సభ సాక్షిగా నాలుగు కోట్ల ప్రజల ముందు సీఎం రేవంత్ బట్టలు విప్పుతామని హెచ్చరించారు. పాలన చేతకాని సన్యాసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని విరుచుకుపడ్డారు. సీఎం రేవంత్.. అచ్చోసిన ఆంబోతు మాదిరి రంకెలు వేయటం మానుకోవాలన్నారు. సొంత రాష్ట్రాన్ని క్యాన్సర్‌తో పోల్చిన భావదారిద్య్రపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంటూ దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కోటీశ్వరులైన మహిళలను మాత్రమే రేవంత్ ఓట్లు అడగాలన్నారు. తెలంగాణ దివాలా తీసిందని.. గత 15 నెలలుగా కాంగ్రెస్ గోబెల్స్ ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. స్వయంగా ముఖ్యమంత్రి తెలంగాణ పరువును గంగలో కలుపుతున్నారన్నారు. కాళేశ్వరంపై కొంతమంది సన్యాసులు చెత్తవాగుడు బంద్ చేయాలని అన్నారు. తెలంగాణ ఆర్థికస్థితిపై ఫిబ్రవరి 17న డిప్యూటీ సీఎం భట్టి విడుదల చేసిన సమగ్రమైన నివేదికను రేవంత్ చదువుకోవాలని సూచించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై వాస్తవాలు చెప్పిన ఉప ముఖ్యమంత్రి భట్టికి



ధన్యవాదాలు తెలియజేశారు. సంపద సృష్టించటంలో కేసీఆర్ ప్రభుత్వం అద్భుతంగా పనిచేసిందన్నారు. రేవంత్ రెడ్డి యాక్సిడెంటల్ సీఎం అంటూ వ్యాఖ్యలు చేశారు. సిగ్గు.. మానం లేని మూర్ఖపు ముఖ్యమంత్రి అని విమర్శించారు. కేసీఆర్‌ను దూషించటం మానుకోకుంటే రేవంత్ మూల్యం చెల్లించుకుంటారని హెచ్చరించారు. పాపం భట్టి విక్రమార్క అమాయకంగా ఇరుక్కున్నారని.. ఆయన ఉద్యోగం ఉంటదో.. పోతుందో? అని అనుమానం వ్యక్తం చేశారు. అప్పులకు వడ్డీ.. రేవంత్ 6వేల 500 కోట్లు అంటున్నారని.. భట్టి 2 వేల 200 కోట్లు అంటున్నారని తెలిపారు. ఢిల్లీ పార్టీలకు తెలంగాణను పరిపాలించుట చేదకాదని తేలిందన్నారు. కేంద్రం ఇచ్చే దానికంటే.. కేంద్రానికి పన్నుల రూపంలో తెలంగాణ ఇచ్చేది ఎక్కువ అని చెప్పుకొచ్చారు. ఒక్క హామీ కూడా అమలు చేయకుండా.. అప్పులు ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. హైడ్రాతో రేవంత్ రెడ్డి.. రియల్ ఎస్టేట్‌కు వెన్నుపోటు పొడిచారన్నారు. నీళ్ళు ఇచ్చుడు చేతకాకుంటే క్రాప్ హాలిడే ప్రకటించాలని మాజీమంత్రి డిమాండ్ చేశారు. కేంద్రమంత్రి బండి సంజయ్‌పై కూడా కేటీఆర్ ్గ÷ర్ అయ్యారు. రేవంత్ రెడ్డికి బండి సంజయ్ రక్షణ కవచంగా నిలబడుతున్నారన్నారు. రేవంత్, సంజయ్‌లు.. ఆర్ఎస్ బ్రదర్స్ అని మార్కెట్‌లో చెప్పుకుంటున్నారని అన్నారు. సీఎం రేవంత్ అవినీతిపై కేంద్రం ఎందుకు చర్యలు తీసుకోవటం లేదని ప్రశ్నించారు. బిల్డర్స్ దగ్గర స్క్వేర్ ఫీట్‌కు రేవంత్ రెడ్డి.. 150 రూపాయలు వసూలు చేస్తున్నారన్నారు. రాహుల్, మోదీ కులంతో ప్రజలకు ఏంటి లాభం అని ప్రశ్నించారు. అమృత్ టెండర్లు, పొంగులేటి ఇంటిపై ఈడీ రైడ్స్ ను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. సుంకిశాల ప్రాజెక్టు కుంగితే.. మేఘా కృష్ణారెడ్డిని రేవంత్ రెడ్డి ఎందుకు కాపాడుతున్నారని నిలదీశారు. కృష్ణజాలల దోపిడీ విషయంలో అసెంబ్లీలో ఎండగడుతామని కేటీఆర్ స్పష్టం చేశారు.

# మహిళలకు నెలనెలా... 2500 పథకం

మొదటిపేజీ తరువాయి...

ఫిబ్రవరి 23న ఆప్ శాసనసభా పక్షాన్ని కలవడానికి సమయం ఇవ్వాలని లేఖలో రేఖా గుప్తాను కోరారు. ఈనెల 20నే ఢిల్లీ ముఖ్యమంత్రిగా రేఖా గుప్తా ప్రమాణస్వీకారం చేశారు. సాయంత్రం కేబినెట్ సమావేశం ఏర్పాటు చేసి ఆయుష్మాన్ భారత్ పథకంపై నిర్ణయం తీసుకున్నారు. ఇక రేఖా గుప్తా ప్రమాణస్వీకారం రోజునే అతిషి ప్రెస్ మీట్ పెట్టి.. తొలి కేబినెట్‌లోనే మహిళలకు రూ.2,500 పథకంపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు కదా? అని నిలదీశారు. ఈ పథకం ఎప్పుడు అమలు చేస్తున్నారో చెప్పాలని నిలదీశారు. దీనిపై శుక్రవారం రేఖా గుప్తా స్పందిస్తూ.. ఒక్క రోజు కాకముందే అతిషి విమర్శలు చేస్తున్నారంటూ తప్పుపట్టారు. కాంగ్రెస్, ఆప్ పాలించిన రోజులు గుర్తుచేశారు. మీరేం చేశారంటూ రేఖా గుప్తా తిరిగి ప్రశ్నిం చారు. తాజాగా మరోసారి అతిషి.. మహిళలకు రూ.2,500 పథకం గురించి లేఖ రాశారు. దీనిపై రేఖా గుప్తా ఎలా స్పందిస్తారో చూడాలి. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 48, ఆప్ 22 సీట్లు సాధించాయి. 27 ఏళ్ల తర్వాత ఢిల్లీలో కాషాయ పార్టీ అధికారాన్ని చేజిక్కించుకుంది. అనూహ్యంగా రేఖా గుప్తాకు ముఖ్యమంత్రి పదవి దక్కింది. తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచినా.. ఆర్ఎస్ఎస్‌తో మంచి సంబంధాలు ఉండడంతో అవకాశం దక్కినట్లుగా వార్తలు వినిపించాయి.

# కుంభమేళాకు కొనసాగుతున్న తాకిడి

మొదటిపేజీ తరువాయి...



ఈ క్రమంలో జనవరి 13 నుంచి ఫిబ్రవరి 22 మధ్య 60 కోట్ల మంది పుణ్యస్నానాలు ఆచరించారని యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ వెల్లడించారు. మహాకుంభ్ శక్తిని యావత్ ప్రపంచం కీర్తిస్తోందని ఆయన పేర్కొన్నారు. మన రాష్ట్ర సామర్థ్యం, అభివృద్ధిపై నమ్మకం లేనివారు కుంభమేళాపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. మహాశివరాత్రి లోపు 60 కోట్ల మంది పుణ్యస్నానాలు ఆచరిస్తారని ముందు అనుకు న్నామని.. కానీ దానికి ముందే అంచనాలకు మించి ప్రజలు హాజరయ్యారని అన్నారు. ప్రతీ 12 ఏళ్లకు ఓసారి నిర్వహించే ఈ మహా కుంభమేళా జనవరి 13న మొదలుకాగా.. ఫిబ్రవరి 26 వరకు కొనసాగనుంది. మొత్తం 40 నుంచి 45 కోట్ల మంది రావచ్చని తొలుత అంచనా వేశారు. కానీ, ప్రపంచం నలుమూలల నుంచి నిత్యం సరాసరి కోటిన్నర మంది వరకు వస్తున్నారు. జనవరి 29న మౌని అమావాస్య రోజే దాదాపు 8 కోట్ల మంది ప్రయాగ్‌రాజ్‌కు వచ్చినట్లు యూపీ ప్రభుత్వం పేర్కొంది. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం మరో నాలుగు రోజుల్లో ముగియనుండడంతో భక్తులు భారీగా తరలివస్తున్నారు. అలాగే యూపి ప్రభుత్వం ఎప్పటికప్పుడు భద్రతా చర్యలు తీసుకుంటోంది.

# అంతు పట్టని దళపతి వ్యూహం

మొదటిపేజీ తరువాయి...

అన్నది కేసీఆర్ చూసుకోవడం లేదా అన్న పాయింట్ కూడా చర్చకు వస్తోంది. నడిపించే నాయకుడు జనానికి దూరంగా.. ఉంటే నష్టం ఎవరికి అన్నది కూడా ఆలోచించడం లేదా అంటున్నారు. ప్రధాన ప్రతిపక్ష నేతగా అసెంబ్లీకి వచ్చి.. ప్రభుత్వం ఏవైనా తప్పులు చేస్తే నిలదీయడం, ఎండగట్టడం, సలహాలు ఇవ్వడం వంటివి కూడా చేయకపోతే ఎలా అన్న పాయింట్ కూడా తెరపైకి వస్తోంది. అంతెందుకు కులగణనలో పాల్గొనకుండా తిరిగి ఆ సర్వేపైనే విమర్శలు చేయడం.. ఇవన్నీ జనం అబ్జర్వ్ చేసే అంశాలే. అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం తర్వాత బీఆర్ఎస్ పార్టీ గ్రాఫ్ మరింతగా పడిపోయింది. తమకు తెలంగాణలో తిరుగే లేదు అనుకున్నగులాబీ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో వచ్చిన సీట్లు సున్నా. ఇది ఎవరూ ఊహించలేదు. అయితేరాష్ట్రంలోనే ఓడారు..ఇకఎంపీ సీట్లు గెలిపించడంఎందుకని జనందూరంపెట్టేశారు. ఇప్పుడు ఏకంగా ఆదిలాబాద్-నిజామాబాద్-కరీంనగర్-మెదక్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి వరుసగా పోటీ పెట్టకపోవడం కూడా వేరే సిగ్నల్స్ ను పార్టీ శ్రేణుల్లోకి, జనంలోకి తీసుకెళ్తోందిఅంతెందుకు ఈ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పరిధిలోనే కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు, కవిత ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇలా సొంతంగా ప్రాతినిధ్యం వహించే చోట కూడా అభ్యర్థిని పెట్టి తమ స్టామినా ఏ పొజిషన్ లో ఉందో చూసుకోవాల్సిన టైంలో అస్త్ర సన్యాసం ఏంటన్న ప్రశ్నలకు కూడా తాజా మీటింగ్ లో జవాబు రాకుండా పోయింది. బీఆర్ఎస్ టిక్కెట్ వస్తుందని నమ్ముకున్న రవీందర్ సింగ్ లాంటి లీడర్లు.. ఇండిపెండెంట్ గా నామినేషన్లు వేసుకున్నారు. ఇదేనా గులాబీ బాస్ తమ లీడర్లు, క్యాడర్ కు ఇచ్చుకునే సందేశం?సో తిరిగి పుంజుకున్నాం.. జనంలోనే ఉన్నాం.. అని చెప్పుకోవాల్సిన పోటీలో దూరం ఉండడం గులాబీ పార్టీకి చాలా నష్టం చేసే అంశం. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు కూడా ఫాంహౌజ్ సీఎం అన్న ప్రచారం జరిగి అది ఓటమికి దారి తీసింది. ఇప్పుడు కూడా పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అధ్యక్షుడిగా ముందుండి నడపాల్సిన టైంలో ఏకంగా 7 నెలల గ్యాప్ తర్వాత ఫాంహౌజ్ నుంచి బయటకు వచ్చారు. ఇలా జరిగితే క్యాడర్ లో జోష్ పెరిగేదెలా.. లీడర్లలో ఉత్సాహం వచ్చేదెలా అన్నది గులాబీ పార్టీలో ఇంటర్నల్ గా జరుగుతున్న డిబేట్. పనిలో పనిగా కాంగ్రెస్ నేతలు కూడా కేసీఆర్ సీజనల్ పొలిటీషియన్ అంటూ, ఆయన ఫాంహౌజ్ లో పర్మినెంట్ గా రెన్ట్ తీసుకుంటేనే బెటర్ అని కౌంటర్లు కూడాఇస్తున్నారు. అయిపోయిందనుకున్న పార్టీలు లేచాయి. లేచిన పార్టీలు పడిపోయినసందర్భాలు చరిత్రలో ఉన్నాయి. అయితేతెలంగాణలో మాత్రం బీఆర్ఎస్ స్పేస్ ను బీజేపీ క్రమంగా ఆక్రమిస్తూ వస్తోంది. ఇది ఆ పార్టీకి అన్నిటికంటే పెద్ద సవాల్. అలాంటి విషయాలపై దిశానిర్దేశాలు లేకుండా పోవడమే పెద్ద మైనస్ అన్న టాక్ ఆ పార్టీలోనే వినిపిస్తోంది. కాంగ్రెస్, బీజేపీకి చెరో 8 ఎంపీ సీట్లున్నా నిధులు తేలేదన్నారు కేసీఆర్. మరి అదే అధికారంలో ఉన్నప్పుడు కేసీఆర్ ఎన్నిసార్లు ఢిల్లీ వెళ్లి.. ఎన్నిసార్లు ప్రధానిని కలిశారన్న పాయింట్ వినిపిస్తోంది. అటు కృష్ణా జలాలను కాపాడుకోవడం తెలియట్లేదన్నారు. మరి బీఆర్ఎస్ అధికారం లో ఉన్నప్పుడు సంగమేశ్వరం పనులు జరుగుతుంటే ఏం చేశారన్న ప్రశ్న తెరపైకి వస్తోంది. ఎమ్మెల్యేలు పార్టీ మారిన చోట్ల బైపోల్స్ రావడం ఖాయమే అంటున్నారు కేసీఆర్. బైపోల్స్ కు పోటీ చేసే ఉత్సాహం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో లేదా.. ధైర్యం చాలట్లేదా.. గతంలో బలం ఉన్నా ప్రత్యర్థి పార్టీల నుంచి ఎమ్మెల్యేలను ఎందుకు లాగేశారన్న ప్రశ్నలకు జవాబులు లేవు. పార్టీ పని అయిపోయిందని సొంత పార్టీ వాళ్లే ప్రచారం చేయడంతోనే పది మంది ఎమ్మెల్యేలు వెళ్లిపోయారని కేసీఆర్‌మీటింగ్‌లో అన్నారు. కానీ అక్కడజరిగిందినిజంగా అదే ఫ్యాక్టరా.. అంటే కాదన్న జవాబు వస్తోంది. మరోవైపు కేసీఆర్ పవర్ లో ఉన్నప్పుడు కేంద్రంతో అంటీ ముట్టనట్లు ఉండడం, ప్రధాని మోడీ రాష్ట్రానికి వచ్చినా కనీసం వెళ్లి కలవకపోవడం, అలక పాన్పు ఎక్కడం, ఎడమొహం పెడమొహం అన్నట్లుగా డీల్ చేయడం ఇవన్నీ జరిగాయి. కేంద్రంతో గట్టిగా కొట్లాడలేదు.. అడగాల్సినవి అడగలేదు. ఫాలోఅప్ చేయాల్సినవి చేయలేదు.. మరి వచ్చేవి ఎలా వస్తాయన్న ప్రశ్నలకు జవాబు లేకుండా పోయింది. ఇంత చేసి తాజా విస్తృతస్థాయి మీటింగ్ లో గులాబీ బాస్ బీజేపీపై ఒక్క మాట కూడా మాట్లాడలేదంటున్నారు. ఇంతకు ముందు కూడా బీజేపీని పెద్దగా టార్గెట్ చేయడం లేదు. బీజేపీ ఇప్పుడు బీఆర్ఎస్ కు డేంజర్ గా మారింది. బీఆర్ఎస్ ఓటు బ్యాంక్ బీజేపీకే వెళ్తోంది. పార్లమెంట్ ఎన్నికల్లోనే ఇది క్లారిఫై అయింది. అలాంటప్పుడు బీజేపీ విషయంలో సాఫ్ట్ గా ఉంటే ఇంకా సమస్యలు ఎదురవుతాయి. కానీ కేసీఆర్ మాత్రం బీజేపీని టార్గెట్ చేసే పరిస్థితిలో కూడా లేరంటున్నారు.

గ్రూపుపై హిండెన్‌బర్గ్ నివేదిక వచ్చింది. ఇప్పుడు ట్రంప్ మరో బాంబు పేల్చారు. ఈ రెంటికీ ఏమైనా సంబంధం ఉందా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. వీటిని జాగ్రత్తగా గమనిస్తే అనుమానాలు ఉన్నట్లు రాజకీయ నిపుణులు కూడా భావిస్తున్నారు. అయితే అంతర్గ వ్యవహారాల్లో దూరి దేశాన్ని అస్థిరపరచాలన్న చీప్ ట్రిక్స్ ఆడారా అన్నది మున్ముందు తేలనుంది. భారత్, అమెరికాలు ప్రపంచంలో రెండు అతి పెద్ద ప్రజాస్వామిక దేశాలు మాత్రమే కాదు, అగ్రగామి ఆర్థిక వ్యవస్థలు కూడా. ఆర్థిక సత్తాలో ప్రథమ స్థానంలో ఉన్న అమెరికా, ఐదవ స్థానంలో ఉన్న భారత్ మధ్య సన్నిహిత సంబంధాలు ఏర్పడడం ప్రపంచానికీ అత్యంత ప్రయోజనకరంగా మారనుంది. అతిపెద్ద మార్కెట్‌గా ఉన్న భారత్‌ను అమెరికా వదులుకోవడానికి సిద్ధంగా లేదు. అలాగే అనేకమంది మన మేధావులు ఇప్పుడు అమెరికన్ ఐటిని శాసిస్తున్నారు. గతంలో మోదీ పర్యటనతో భారతీయ అమెరికన్లలో ఒక రకమైన ఆత్మ స్థైర్యం, బలం ఏర్పడిందనడంలో సందేహం లేదు. అమెరికా జనాభాలో ఒక శాతంగా ఉన్న భారత అమెరికన్లు ఇరు దేశాల మధ్య సంబంధాలు మరింత బలోపేతం కావాలని కోరుకుంటున్నారు. ఈ క్రమంలో కొందరు అస్థిరపరచే చర్యలు చేస్తున్నట్లుగా తెలుస్తోంది. ఇలాటి వారిపై కఠినంగా ఉండాల్సిందే. నిజానికి మనం ఏ దేశంలోనూ వేలుపెట్టే అవకాశం తెచ్చుకోం. ఇతరులు జోలికి వస్తే ఊరుకోం. ఏ దేశానికైనా పటిష్టమైన విదేశాంగ విధానం ఉండాలి. ప్రపంచ దేశాల్లో ఇదే ముఖ్యం. ఇతర దేశాలు కష్టసమయాల్లో ఉంటే ఆదుకోవాలి. అన్నార్తులను ఆదుకునే ప్రయత్నం చేయాలి. ఇరుగుపొరుగుతో ఇచ్చిపుచ్చుకునే ధోరణి ముందునుంచీ మనం పాటిస్తున్నాం. దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకుంటూనే..సర్వస్వతంత్రంగా మనగలగేలా మన గత పాలకులు, ప్రస్తుత పాలకులు వ్యవహరిస్తున్నారు. గతంలో పాక్ మంత్రులు పలువురు ఇలాగే ప్రేలారు. తల్లిపాలు తాగి రొమ్ముగుద్దే రకంలో పాక్ ముందుంటుంది. ఇప్పుడు బంగ్లా తోడయ్యింది. బిబిసి కూడా అడపాదడపా తన కుట్రలను వెల్లడిస్తోంది. మొన్నటికి మొన్న మాజీ చీఫ్ జస్టిస్ డివై చంద్రచూడ్ ఇంటర్వ్యూలో కూడా బిబిసి అడిగిన ప్రశ్నలు దాని కుత్సిత స్వభావాన్ని బయటపెట్టాయి. ఆదానీ విషయంలో కూడా అమెరికా హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణలను గర్హించాల్సిందే. దేశంలో మనం నిలదీయాల్సిన సమస్యల్లో విదేశీయులను తలదూర్చేలా చేయడం వల్ల అంతర్జాతీయంగా మనపరువును మనమే పోగొట్టుకున్న వారం అవుతాం. నిజానికిమోదీ హయాంలో ప్రపంచ దేశాల్లో భారత్‌కు లభించినంత గుర్తింపు మరే ప్రధానమంత్రి హయాంలో లభించలేదన్న విషయం ఎవరైనా గుర్తించాల్సిందే. కరోనా సమయంలో అనేక పేద దేశాలకు ఉచితంగా వ్యాక్సిన సరఫరా చేసి వారికి అండగా నిలిచారు. అలాగే టర్కీ, సిరియా భూకంప బాధితులకు అండగా నిలిచిన మన బృందాలు సహాయక చర్యల్లో పాల్గొన్నాయి. గత పదేళ్లలో మోదీ ప్రపంచంలోని దాదాపు అన్ని దేశాలలోనూ పర్యటించి భారత్‌కు అంతర్జాతీయంగా అనితరసాధ్యమైన గుర్తింపు తీసుకుని వచ్చారు. ఏదేశమేగినా మోడీ గురంచి చర్చించుకునేలా చేశారు. విదేశాగ విధానంలో మోడీ కొత్త ఒరవడిని సృష్టించారు. అగ్రరాజ్యాలైన అమెరికా, రష్యాలతోపాటు చైనాతో కూడా సత్సంబధాలు నెలకొల్పడంలో మోడీ విజయం సాధించారు. చిన్నిచిన దేశాలకు ఆపన్నహస్తం అందించడం ద్వారా భారత్ వారికి అండగా నిలుస్తుందన్న భరోసా ఇచ్చారు. భారతదేశంలో విచ్ఛిన్నకర శక్తులను ఏరివేయడం, కశ్మీర్‌లో పాక్ ఉగ్రవాదానికి కళ్లెం వేయడం వెనుక ప్రపంచ దేశాల అండదండలున్నాయని,మోదీ వివిధ దేశాధినేతలతో ఏర్పర్చుకున్న సత్సంబంధాల వల్లే ఇవాళ మనకు అంతర్జాతీయ మద్దతు లభిస్తున్నదని విదేశీ వ్యవహారా లను పరిశీలించే వారెవరికైనా అర్థమవుతుంది. పాక్‌ను ఉగ్రవాద దేశంగా ప్రకటించడం, ఇస్లామిక్ దేశాలు కూడా ఆ దేశానికి మద్దతు నీయకపోవడం, అంతర్జాతీయంగా పాకిస్థాన్ ఏకాకి కావడం మొదలైన పరిణా మాలు భారత్‌కు అంతర్జాతీయంగా ఉన్న పట్టును సూచిస్తున్నాయి. ముఖ్యంగా అమెరికా అండదండలు బలంగా లభించాయని స్పష్టమవుతోంది. ప్రపంచంలో మోడీ సమర్థ నేతగా ఎదగడం వల్లనే అనేక దేశాలు ఇప్పుడు భారత్‌వైపు చూస్తున్నాయి. ఈ రకమైన మద్దతు ద్వారా మనదేశ ప్రతిభ విస్తరించడమే గాకుండా ప్రపంచంలో మనకు పెద్దన్న పాత్రను కట్టబెడుతున్నాయి. ప్రధానంగా ఇస్లామిక్ టెర్రరిజంపై పోరాడుతున్న దేశంగా భారత్‌తో కలసి అనేక దేశాలు ముందుకు వస్తున్నాయి. అందులో అమెరికా కూడా ఉంది. అందుకే అమెరికాలో మోదీ పర్యటించినప్పుడల్లా ప్రపంచం ఆసక్తిగా చూస్తోంది. ఇరు దేశాల్లో గతంలో ఎన్నడూ లేనంత చెలిమి నెలకొంది. ముఖ్యంగా మోదీ ప్రధానమంత్రి అయిన తర్వాత భారత్ – అమెరికాల మధ్య సాన్నిహిత్యం మరింత పెరిగింది. భారత్, అమెరికా ప్రభుత్వాధినేతల మధ్య ఎన్నడూ లేని రీతిలో దృఢంగా వున్నాయి. ఉగ్రవాదం,ఆర్థిక అసమానతలు, రక్షణ సహకారం,ఇంటెలిజెన్స్ సమాచార పంపిణీ, పర్యావరణం, సైబర్ నేరాలు, ఇంధన భద్రత, కమ్యూనికేషన్ విప్లవం, వర్తక సంబంధాలు, పెట్టుబడులు, మార్కెట్ విస్తరణ, ఉపాధి కల్పన వంటి అనేక విషయాలపై అమెరికా భారత్‌లు ఒక స్పష్టమైన అవగాహనతో ఉన్నాయి. ఉగ్రవాదాన్ని కలిసికట్టుగా నిర్మూలించడం ఎంత ముఖ్యమో, ప్రపంచ మార్కెట్‌లో చైనా దూకుడు తగ్గించడం కూడా అంతే ముఖ్యమని ఇరు దేశాలు భావిస్తున్నాయి. అమెరికా,చైనా దేశాల మధ్య పెరుగుతున్న స్పర్థలు, వాణిజ్య పోటీ భారత్‌కు ఎంతో ఉపకరిస్తుందనడంలో సందేహం లేదు. అంతేకాక అమెరికా టెక్నాలజీ సంస్థలకు భారత్‌లో లభిస్తున్న అతి పెద్ద వినియోగ మార్కెట్, బహిరంగ డేటా వరప్రదాయినిగా కనిపిస్తోంది. టెక్నాలజీ రంగంలో వస్తున్న మార్పులను వినియోగించుకోకపోతే ఆర్థికాభివృద్ధి సాధ్యం కాదని అందరికీ తెలుసు. ఈ క్రమంలో ఎలాంటి సవాళ్లనయినా తిప్పికొట్టగలగాలి.

ఉండి ఇలా మాట్లాడడం సహేతుకమేనా అని నిలదీశారు. శ్రీశైలం డ్యామ్ నిర్మాణం ఎవరి త్యాగాలతో నిర్మించారో రేవంత్ రెడ్డికి తెలియదా అని అడిగారు. ప్రజలను మోసం చేసి రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చారు. ఏపీ తన కాళ్ల మీద

కాంగ్రెస్ పని అయిపోయింది. దేశంలో 22 రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలో ఉంటే కాంగ్రెస్ ఉన్న రాష్ట్రాల్లో కూడా అధికారం కోల్పోతుందని విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు.

# నల్గొండలో బర్డ్‌ఫ్లూ.. 7 వేల కోళ్లు పాతిపెట్టిన వైనం..



నల్లగొండ, యదార్థవాది ప్రతినిధి, ఫిబ్రవరి 22: నల్గొండ జిల్లా కేతపల్లి మండలం చెరుకుపల్లి గ్రామంలోని ఓ పౌల్ట్రీ ఫారంలో భారీ సంఖ్యలో కోళ్లు చనిపోవడంతో బర్డ్ ఫ్లూ భయాందోళనకు గురిచేసింది. గ్రామంలోని రైతులు తాము నష్టపోయిన విషయాన్ని తెలియజేస్తూ, ప్రభుత్వ సహాయం కోరుతున్నారు. చెరుకుపల్లి గ్రామంలోని పౌల్ట్రీ ఫారంలో గత కొన్ని రోజులుగా కోళ్లు అనారోగ్యానికి గురవుతుండగా, ఈ సమస్య మరింత తీవ్రమై సుమారు 7,000 కోళ్లు ఆకస్మికంగా మరణించాయి. ఈ ఘటనతో గ్రామస్తుల మధ్య భయాందోళనలు వ్యక్తమయ్యాయి. బర్డ్ ఫ్లూ సోకినట్టుగా అనుమానం వ్యక్తమవుతున్న నేపథ్యంలో, రైతులు తక్షణమే స్పందించి, చనిపోయిన కోళ్లను జేసీబీ సహాయంతో పూడ్చిపెట్టారు. కోళ్లు అనారోగ్యానికి గురవుతున్న విషయాన్ని గమనించిన వెంటనే రైతులు హైదరాబాద్ నుంచి నిపుణులైన వెటర్నరీ డాక్టర్లను రప్పించారు. అయితే, పలు మార్లు వైద్యం అందించినప్పటికీ ఎటువంటి ఫలితం కనిపించలేదు. రైతులు తమ కోళ్లను రక్షించేందుకు అన్ని విధాలుగా ప్రయత్నించినప్పటికీ, అనారోగ్యం మరింత తీవ్రమై కోళ్ల మరణాన్ని తలపెట్టింది.

# కుంభమేళాలో నడ్డా పవిత్ర స్నానం

ప్రయాగరాజ్, శాసనసభ ప్రతినిధి, ఫిబ్రవరి 22: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ లో జరుగుతున్న ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక కార్యక్రమం మహాకుంభమేళా ముగింపు దశకు చేరుకుంది. మరో ఐదు రోజుల్లో మహాకుంభమేళా ముగియనుంది. ఈ క్రమంలో గంగ, యమున, సరస్వతి నదులు కలిసే పవిత్ర త్రివేణీ సంగమంలో పుణ్య స్నానాలు చేసేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. 45 రోజుల పాటు జరిగే ఈ కుంభమేళాకు సామాన్య భక్తులతోపాటు ప్రముఖులు కూడా తరలివస్తున్నారు. ఇప్పటికే రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా సహా పలువురు కేంద్ర మంత్రులు, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, గవర్నర్లు ఇప్పటికే త్రివేణీ సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించిన విషయం తెలిసిందే. తాజాగా కేంద్ర మంత్రి జేపీ నడ్డా మహాకుంభమేళాను సందర్శించారు.



యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌తో కలిసి త్రివేణీ సంగమంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. అనంతరం అక్కడ ప్రత్యేక పూజలు చేశారు.



# శక్తికాంత దాస్‌కు ప్రమోషన్

## ప్రధాని ప్రిన్సిపల్ సెక్రటరీ-2 గా నియామకం



న్యూఢిల్లీ, యదార్థవాది ప్రతినిధి, ఫిబ్రవరి22 : రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మాజీ గవర్నర్ శక్తికాంత దాస్ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రిన్సిపల్ సెక్రటరీ–2గా నియమితులయ్యారు. ఆయన నియామకాన్ని అపాయింట్‌మెంట్స్ కమిటీ ఆఫ్ క్యాబినెట్ ఆమోదించింది. శక్తికాంత దాస్ భాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఆయన నియమాకం అమల్లోకి వస్తుంది. ప్రధానమంత్రి టర్మ్ వరకు కానీ తదుపరి ఉత్తర్వులు వెలువడేంత వరకూ ఆయన ఈ పదవిలో కొనసాగుతారని ప్రభుత్వ ప్రకటన పేర్కొంది. పీకే మిశ్రా 2019 సెప్టెంబర్ 11 నుంచి ప్రధానమంత్రికి పర్సనల్ సెక్రటరీగా ఉన్నారు. ఆరేళ్ల పాటు ఆర్బీఐ గవర్నర్‌గా పనిచేసిన శక్తికాంత దాస్ గత ఏడాది డిసెంబర్‌లో పదవీ విరమణ చేశారు. దీంతో ఆర్బీఐ 26వ గవర్నర్‌గా సంజయ్ మల్హోత్రా బాధ్యతలు స్వీకరించారు. 67 ఏళ్ల శక్తికాంత దాస్ 2018లో ఊర్జిత్ పటేల్ అకస్మాత్తుగా రాజీనామా చేయడంలో ఆర్బీఐ గవర్నర్ గవర్నర్ బాధ్యతలు చేపట్టారు. 1980 తమిళనాడు ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన దాస్ ఢిల్లీలోని సెయింట్ స్టీఫెన్ కాలేజీలో మాస్టర్ డిగ్రీ చేశారు. బర్మింగ్‌హామ్ యూనివర్సిటీలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశారు. 2016 నవంబర్‌లో పెద్దనోట్లను రద్దు చేసినప్పుడు ఆర్థిక వ్యవహారాల కార్యదర్శిగా శక్తికాంతదాస్ ఉన్నారు. 2017 జూలై 1 నుంచి పలు ప్రత్యక్ష పన్నులు జీఎస్‌టీలో విలీనం చేయడంలో ఆయన కీలకంగా వ్యవహరించారు. 2021లో ఆర్బీఐ గవర్నర్‌గా ఆయన పదవికాలం ముగియాల్సి ఉండగా మరో మూడేళ్లు పదవీకాలాన్ని పొడిగించారు.





అమరావతి, యదార్థవాది ప్రతినిధి, ఫిబ్రవరి 22: నేటి గ్రూప్–2 మెయిన్స్ పరీక్షలు వాయిదా పడ్డాయి. ఈ మేరకు గ్రూప్స్ 2 మెయిన్ పరీక్షలపై ఏపీపీఎస్సీ కీలక ప్రకటన చేసింది. ఆదివారంనిర్వహించాల్సిన పరీక్షను కొద్ది రోజుల పాటు వాయిదా వేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఏపీపీఎస్సీ సెక్రటరీకి రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసింది. రోస్టర్ తప్పులను సరిచేయకుండా పరీక్ష నిర్వహణపై అభ్యర్థుల నుంచి అభ్యంతరాలు వెల్లువెత్తడంతో ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం రోస్టర్ అంశంపై ఏపీ హైకోర్టులో పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. వచ్చే నెల 11వ తేదీన మరోమారు ఈ పిటిషన్‌పై హైకోర్టు విచారణ చేపట్టనుంది. హై కోర్టులో ఉన్న ఈ అంశంపై అఫిడవిట్ వేసేందుకు ఇంకా సమయం ఉందని అప్పటి వరకు పరీక్షలు నిర్వహించవద్దని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసింది. కాగా, గ్రూప్–2 మెయిన్స్ పరీక్షలు వాయిదా వేయాలని, రోస్టర్ విధానంలో మార్పులు చేయాలంటూ అభ్యర్థులు కొద్దిరోజులుగా ఆందోళనలు చేస్తున్నారు. ఈ విషయంపై అభ్యర్థులు హైకోర్టుకు వెళ్లగా.. పరీక్షలను నిలిపి వేయడాన్ని నిరాకరిస్తూ సింగిల్ జడ్జి ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో గ్రూప్–2 అభ్యర్థులు పెద్దఎత్తున నిరసనలకు దిగారు. విశాఖపట్నం, హైదరాబాద్ సహా వివిధ ప్రాంతాల్లో రోడ్డెక్కి ఆందోళనలు చేశారు. 2023 డిసెంబరు 7వ తేదీన ఏపీపీఎస్సీ ఇచ్చిన నోటిఫికేషన్ సుప్రీంకోర్టు తీర్పు, ఏపీ ప్రభుత్వం ఇచ్చిన జీవో 77కి విరుద్ధంగా ఉందని, ఈ విషయాన్ని సింగిల్ జడ్జి విస్మరించారని తెలిపారు. సింగిల్ జడ్జి ఉత్తర్వులపై స్టే విధించి, 23న జరగనున్న గ్రూపు–2 మెయిన్స్ పరీక్షను నిలిపివేసేలా ఆదేశాలు ఇవ్వాలని హైకోర్టును ఆశ్రయించారు. అయితే గ్రూప్–2 మెయిన్స్ పరీక్ష అనంతరం అభ్యర్థుల నుంచి మరోసారి పోస్టుల ప్రాధాన్యతలు తీసుకుంటారని ఏపీపీఎస్సీ తెలిపింది. ఉద్యోగాలకు ఎంపికైన వారి జాబితా రూపొందించే ముందు దీనికి సంబంధించిన పక్రియ చేపడతామని తెలిపింది. పోస్టులు, జోన్‌లపై అభ్యర్థులు ప్రాధాన్యతలు ఇవ్వాల్సి ఉంటుందని వెల్లడించింది. అలాగే న్యాయం చేస్తానని మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చారు.

# మహిళా శిశు సంక్షేమ శాఖలో కొలువులు

## మొత్తం 14,236 పోస్టుల భర్తీకి రంగం సిద్ధం

హైదరాబాద్, యదార్థవాది ప్రతినిధి, ఫిబ్రవరి22 : రాష్ట్రంలోని మహిళా శిశు సంక్షేమ శాఖలో కొలువుల జాతర మొదలైంది. అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల ఖాళీల భర్తీకి ప్రభుత్వం నుంచి గ్రీన్‌సిగ్నల్ వచ్చేసింది. ఖాళీల భర్తీకి సంబంధించిన ఫైల్ మహిళా శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్క సంతకం చేశారు. మొత్తం 6399 అంగన్వాడీ టీచర్లు, 7837 హెల్పర్ల పోస్టుల భర్తీకి రంగం సిద్ధమైంది. ఎన్నికల కోడ్ ముగియగానే నోటిఫికేషన్ జారీ అయ్యే అవకాశం ఉంది. అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల పోస్టుల భర్తీకి సంబంధించి ఆయా జిల్లాల కలెక్టర్లు నోటిఫికేషన్‌ను జారీ చేయనున్నారు. మొత్తం 14,236 పోస్టులను తెలంగాణ ప్రభుత్వం భర్తీ చేయనుంది. తెలంగాణలో ఈ స్థాయిలో అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల కొలువులను భర్తీ చేయడం ఇదే తొలిసారి. ఖాళీల భర్తీ ప్రకియతో అంగన్వాడీలు మరింత పటిష్టంగా పనిచేయనున్నారు.

# చెత్తపన్ను రద్దు ఉత్తర్వులు జాలీ

అమరావతి, యదార్థవాది ప్రతినిధి, ఫిబ్రవరి22 : ఆంధ్రప్రదేశ్‌లో చెత్త పన్నును ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా అధికారంలోకి వచ్చాక? చెత్త పన్ను రద్దు చేస్తామని కూటమి నేతలు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత గతేడాది డిసెంబర్ 31 నుంచి చెత్త పన్ను రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. తాజాగా మున్సిపల్ చట్ట సవరణ తర్వాత గెజిట్ జారీ అయింది. ఇక నుంచి ఏపీలో చెత్తపై పన్ను ఉండదు. గత ప్రభుత్వ హయాంలో చెత్తపై పన్ను వేశారు. దీనిపై కూటమి నేతలు విమర్శలు గుప్పించారు. ఎన్నికల ప్రచారంలో ఇదే అస్త్రంగా విమర్శలు గుప్పించారు. అధికారంలోకి వస్తే.. చెత్త పన్ను రద్దు చేస్తామని ప్రకటించారు. ఎన్నికల హామీల్లో భాగంగా చెత్త పన్ను రద్దు చేశారు.

# పట్టాలు తప్పిన గూడ్సు

భువనేశ్వర్, యదార్థవాది ప్రతినిధి, ఫిబ్రవరి22 : ఇటీవల చోటుచేసుకుంటున్న రైలు ప్రమాదాలు ప్రయాణికులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. రైళ్లు పట్టాలు తప్పడం, ఒకదానికి ఒకటి ఢీకొట్టడం, ట్రైన్లలో మంటలు చెలరేగడం వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. టెక్నికల్ సమస్యలతో, మానవ తప్పిదాల కారణంగా కూడా రైళ్లు ప్రమాదబారినపడుతున్నాయి. తాజాగా మరో రైలు ప్రమాదం చోటుచేసుకుంది. ఒడిశాలో ఓ గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. ఈ ప్రమాదంలో మూడు బోగీలు దెబ్బతిన్నాయి. ఈ ఘటన శుక్రవారం రాత్రి 8.30 గంటల ప్రాంతంలో చోటు చేసుకుంది.



వేములవాడ, యదార్థవాది, ఫిబ్రవరి 22: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలనీ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు..శనివారం వేములవాడ పట్టణ పరిధిలోని నాంపల్లిలోని నిర్మలా ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ లో నిర్వహించిన స్పోర్ట్స్ డే సెలబ్రేషన్ లో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై స్పోర్ట్స్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు..ఈ సందర్భంగా ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు. అనతరం వారు మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తే జీవితంలో ఎంత పెద్ద ఇబ్బందులు ఎదురైన దృఢంగా ఉంటారని, క్రీడల వల్ల మానసిక ఉల్లాశం శరీరక దృఢత్వం లభిస్తుందన్నారు. ఆనాడు చదువుకుందాం అంటే సౌకర్యాలు లేని సందర్భంలో ఇప్పుడు సకల సౌకర్యాలు ఉన్నాయని చక్కగా చదువు లో రాణించి తల్లిదండ్రులు మీ పై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా జీవితంలో ఉన్నత స్థాయిలో ఉండాలని అన్నారు..విద్యావలన జీవితంలో మంచిని స్వీకరించి చెడును వదిలేయన్నారు..ఉపాధ్యాయులు విద్యార్థులలోని సృజనాత్మను వెలికి తీసి వారిని ఆయా రంగాల్లో రాణించేలా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. పాఠశాలలో పేద విద్యార్థులకు ప్రాధన్యత ఇవ్వలన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో విద్యావ్యవస్థల పెను మార్పులు తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు... ప్రజా ప్రభుత్వంలో క్రీడలకు ప్రాధాన్యత ఇస్తున్నారని రానున్న ఒలంపిక్ పోటీల్లో పాల్గొనడానికి రాష్ట్రంలో స్పోర్ట్స్ యూనివర్సిటీ ప్రారంభించడం జరుగుతుందన్నారు... విద్యార్థులు విద్యార్థులు చదువుతోపాటు క్రీడలకు రాణించాలని పిలుపునిచ్చారు.

## మానవ హక్కులపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలి

### హెచ్ఆర్సీ చైర్మన్ జస్టిస్ చంద్రయ్య



వేములవాడ, యదార్థవాది, ఫిబ్రవరి 22: తెలంగాణలో మానవ హక్కుల పై న్యాయవాదులు న్యాయమూర్తులతో పాటు ప్రజలు ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ చంద్రయ్య అన్నారు. శనివారం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేములవాడ కోర్టు బార్ అసోసియేషన్ హాల్లో న్యాయవాదులతో సమావేశం అనంతరం ఆయన మాట్లాడుతూ మానవ హక్కులపై అవగాహన లేక ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారికి రక్షణ కల్పించడానికే మానవ హక్కుల కమిషన్ ఏర్పడిందని, హక్కులను కాలరాసే ఏ ఒక్కరిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని, మానవ హక్కుల కమిషన్ కి వచ్చిన ప్రతి ఒక్కరికి న్యాయం దొరుకుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి జ్యోతిర్మయి, వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు గుడిసె సదానందం, ప్రధాన కార్యదర్శి అవధూత రజనీకాంత్, సీనియర్ సివిల్ కోర్ట్ ఏజీపీ బొడ్డు ప్రశాంత్ కుమార్, న్యాయవాదులు నాగుల సత్యనారాయణ, విద్యాసాగర్ రావు, పొత్తూరు అనిల్ కుమార్, గొంటి శంకర్, మాదాసు దేవయ్య, లింగాల నారాయణరావు, జి శ్రీనివాస్, బొజ్జ నరేష్, సుదర్శన్ ,నాగేంద్రబాబు, జనార్దన్ మహిళ న్యాయవాదులు అన్నపూర్ణ ,సుజాత ఉన్నారు.

## మాజీ మంత్రి జగదీష్ రెడ్డి దిష్టి బొమ్మ దహనం



సూర్యాపేట, యదార్థవాది ప్రతినిధి, ఫిబ్రవరి 22: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలంగాణ నుంచి తరిమేస్తామని మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు సరికాదని తీవ్రంగా ఖండిస్తున్నామని సూర్యాపేట నియోజకవర్గం టిడిపి అధ్యక్షులు నాతాల రాంరెడ్డి అన్నారు. మాజీమంత్రి జగదీష్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు నిరసనగా నియోజకవర్గ టిడిపి ఆధ్వర్యంలో శనివారం స్థానిక వానిజ్య భవన్ సెంటర్లో ధర్నా నిర్వహించి మాజీమంత్రి జగదీష్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి మాట్లాడారు. పదేండ్లు మంత్రిగా పనిచేసిన జగదీష్ రెడ్డి తన హుందాను మరచి మాట్లాడడం సరికాదన్నారు. తుంగతుర్తి నియోజకవర్గం నాగారం నుంచి వచ్చిన మిమ్మల్ని సూర్యాపేట ప్రజలు మూడుసార్లు గెలిపించానే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. మీరు ఎక్కడైనా వెళ్లి రాజకీయాలు చేయవచ్చు కానీ చంద్రబాబు తెలంగాణకు వస్తే తన్నుతా తరుముతాం అనడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. మాజీ మంత్రిగా శాసనసభ్యులుగా సభ్యతతో ఉండాలి గౌరవప్రదమైన విమర్శలు చేయాలని వెంటనే నారా చంద్రబాబు నాయుడుకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి పార్లమెంట్ జనరల్ సెక్రెటరీ ధరావత్ వెంకన్న,నియోజకవర్గం టిడిపి నాయకులు రవి నాయక్,శెట్టిపల్లి సైదులు, ఏర్పుల లింగయ్య, కలపట్ల వెంకన్న, గోవిందా చారి,నకిరేకల్ వీరారెడ్డి, కంచర్ల సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్యారేజీలో కేవలం పిల్లర్ కుంగితే నానా హంగామా చేసిన కాంగ్రెస్ నేతలు.. వారి హయాంలో జరుగుతున్న వరుస వైఫల్యాలపై ఏమంటారని ప్రశ్నించారు. సుంకిశాల ప్రమాదంలో గుత్తేదారును కాపాడేందుకు వాస్తవాలు దాచి పెట్టిన ప్రభుత్వం.. కనీసం ఎస్ఎల్‌బీసీ ఘటనలో పారదర్శకంగా దర్యాప్తు జరిపి ప్రమాదానికి గల కారణాలను బయటపెట్టాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కోట్లాది రూపాయల ప్రజాధనంతో చేపడుతున్న ఎస్ఎల్‌బీసీ సొరంగం కూలిపోవడం కాంగ్రెస్ సర్కార్ అసమర్ధతకు, చేతగాని తనానికి నిదర్శనం అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజమెత్తారు. చేయక చేయక ఒక ప్రాజెక్టు పనులు మొదలుపెట్టి ఆరంభంలోనే అంతం చేసిన ఘనత కాంగ్రెస్ పాలకులదే అని విమర్శించారు. మొన్న

## జిల్లాలో ఉపాధి హామీ కూలీలను పెంచాలి



జగిత్యాల, యదార్థవాది ప్రతినిధి, ఫిబ్రవరి 22: జిల్లా అధికారులతో ఉపాధి హామీ పనుల పురోగతిపై సమీక్షించిన జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ శనివారం జిల్లాలోని అన్ని మండలాల ఎంపీడీవో ఎంపీఓ ఏపీవో లు జిల్లా అధికారులతో జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయా మండల వారీగా ఉపాధి హామీ కూలీల పెంపు సమ్మర్ యాక్షన్ ప్లాన్ , ఇంటి పన్ను వసూలు వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అన్ని గ్రామంలో ఉపాధి హామీ కూలీలు పెంపు కోసం ఒక్కొక్క గ్రామంలో 50 మందికి తక్కువ కాకుండా ఉపాధి హామీ కూలీలను పెంపొందించాలని అధికారులకు ఆదేశించారు. ఈజీఎస్ పనులపై ప్రతి గ్రామంలో పంచాయతీ కార్యదర్శులతో సమన్వయం చేసుకొని వెళ్లాలని ఎంపీఓలకు ఆదేశించారు. మార్చి నెల 10 తేదీ వరకు ఇంటి పన్ను వసూలు 100 శాతం పూర్తి చేయాలని అన్నారు. వేసవికాలం ప్రారంభం అవుతున్న నేపథ్యంలో జిల్లాలో ప్రతి ఒక్క గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా పక్కాగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే గ్రామంలో త్రాగునీరు అందించే చేతిపంపులు త్రీఫేస్ టూ పేస్ మోటర్లు రిపేరు చేసి అందుబాటులోకి తీసుకురావాలని, నర్సరీలు సంరక్షణ పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్ని నర్సరీలలో రిజిస్టర్లను పక్కాగా నమోదు చేయాలని, వేసవికాలం నేపథ్యంలో మొక్కలు ఎండిపోకుండా నీటి సదుపాయం కల్పించి మొక్కలను సంరక్షించాలని నర్సరీలో ఉపాధి హామీ కూలీలకు త్రాగునీటి సదుపాయం కల్పించాలని, జిల్లాలో పెండింగ్ ఉన్న ట్రేడ్ లైసెన్స్ గడువు ముగిసినా వాటిని రెన్యువల్ చెయ్యాలని అలాగే జిల్లాలో పెండింగ్ ఉన్న 12 సెల్ టవర్ దరఖాస్తులను పరిశీలించాలని తెలిపారు. ఈ సమావేశంలో డి ఆర్ డి ఓ , రఘు వరుణ్ , డిపిఓ, మధన్ మోహన్, మున్సిపల్ కమిషనర్ చిరంజీవి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## వ్యాయామంతోనే ఆరోగ్యం సాధ్యం



హుస్నాబాద్, యదార్థవాది ప్రతినిధి, ఫిబ్రవరి 22: ఆరోగ్యమే మహాభాగ్యం అనే నానుడిని నిజం చేయాలంటే ఆచరణలో ప్రతినిత్యం నడక, పరుగు,వ్యాయామంతోనే ఇది సాధ్యమవుతుందని సీనియర్ క్రీడాకారులు, సిద్దిపేట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి అన్నారు. శనివారం ఉదయం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని స్థానిక గాంధీ చౌరస్తాలో పట్టణానికి చెందిన ఫిజికల్ డైరెక్టర్ బూట్ల రాజమల్లయ్య తన 55వ జన్మదినం సందర్భంగా పది కిలోమీటర్ల పరుగు పూర్తి చేసినందుకు ఆయనను శాలువాతో సన్మానించి ఈ వయసులో పరుగు చేసిన ఆయన యువతకు స్ఫూర్తి అని అభినందించారు. ఈ సందర్భంగా లింగమూర్తి మాట్లాడుతూ వయస్సుతో నిమిత్తం లేకుండా మంచి ఆరోగ్యపు అలవాట్లతో నిత్యం శారీరక దారుఢ్యాన్ని పెంపొందించుకోవచ్చని ఆయన తెలిపారు. పుట్టినరోజు వేడుకలకు హంగులు,ఆర్భాటాలకు, పార్టీ లకు వెచ్చింకుండా ఇలాంటి సామాజిక సమాజ హితం కోరే కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా ఫిజికల్ డైరెక్టర్ రాజమల్లయ్య మాట్లాడుతూ తను 50 ఏళ్లు పూర్తయిన గత నాలుగు సంవత్సరాలుగా తన జన్మదినం సందర్భంగా 21కే పరుగు (హాఫ్ మారథాన్) చేస్తున్నానని తెలిపారు. 50 ఏళ్లు పూర్తయిన వారు వయసు మీద పడుతుందని భావించకుండా మంచి ఆరోగ్య పు అలవాట్లు,మంచి జీవన విధానంతో మనిషి చనిపోయే వరకు నడక,పరుగు చేయవచ్చునని ఆయన పేర్కొన్నారు. మంచి ఆరోగ్యవంతమైన సమాజం రూపొందించాలనే సంకల్పంతోనే ఈ జన్మదిన పరుగు ప్రతి ఏటా చేపడుతున్నట్లు రాజమల్లయ్య చెప్పారు. 10కే పరుగు పూర్తి చేసి మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నమస్కరించారు. ఆయన జన్మదినం సందర్భంగా 10%ఎ% పూర్తి చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ సీనియర్ క్రీడాకారులు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి,టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షులు ఎండి హసన్, మిత్రమండలి -87 స్వచ్ఛంద సంస్థ ప్రధాన కార్యదర్శి దొడ్డి శ్రీనివాస్,కోశాధికారి పెరుమాళ్ళ శ్రీనివాస్ గౌడ్, కార్యదర్శి కానుగుల మోహన్ పూదరి వరప్రసాద్, పూదరి రమేష్, బత్తుల రవీందర్ తదితరులు బూట్ల రాజ మల్లయ్య ను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రమాదంలో ఏడుగురు కార్మికులు తీవ్రంగా గాయపడగా, మరికొంత మంది కార్మికులు లోపల ఉన్నట్లు తెలుస్తుంది. వారిని క్షేమంగా బయటకు తీసుకువచ్చేందుకు యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలి. ఈ ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించి వారి ప్రాణాలు కాపాడాలి. డీ వాటరింగ్ చేసి, వెంటనే విద్యుత్ పునరుద్ధరించి, శిథిలాలను తొలగించి కార్మికులను వెంటనే బయటకు తీసుకురావాలి. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ వెంటనే ఈ ఘటనపై దర్యాప్తు చేయాలని డిమాండ్ చేస్తున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

## గురుకులంలో కలెక్టర్ బస..

### విద్యార్థులు లక్ష్యసాధనకు శ్రమించాలి..జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్..



జగిత్యాల, యదార్థవాది ప్రతినిధి, ఫిబ్రవరి 22: విద్యార్థులతో కలిసి భోజనం వసతుల కల్పన పై ఆరా.. సమస్యలుంటే నిర్భయంగా చెప్పాలని సూచన.. విద్యార్థులు తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా లక్ష్యసాధనకు కఠోరంగ శ్రమించాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ పేర్కొన్నారు. కష్టపడి చదవడం వల్ల మంచి ఫలితాలు సాధించవచ్చనీ, తద్వారా పెద్ద ఉద్యోగాలు సాధించే అవకాశం ఉంటుందని తెలిపారు. జగిత్యాల జిల్లా పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో శనివారం రాత్రి జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ బాస చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులు బోధించిన పాఠాలను కలెక్టర్ శ్రద్ధగా విన్నారు. విద్యార్థుల పనితీరును గమనించి ఉపాధ్యాయులను అభినందించారు. దీంతోపాటు నిద్రించే సమయంలో విద్యార్థులతోనూ మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల స్టడీ అవర్స్ ను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజన, వసతి సదుపాయాలు, విద్యా బోధన, రోజువారీ దినచర్య, మెనూ తదితర వివరాలను పాఠశాల ప్రిన్సిపాల్ ను అడిగి తెలుసుకున్నారు. స్టడీ అవర్స్ కొనసాగుతున్న గదులను సందర్శించి విద్యార్థులతో కలెక్టర్ కలెక్టర్ మాట్లాడారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు అడిగి తెలుసుకొని వారి సామర్థ్యాన్ని వ్పరిశీలించారు. ప్రభుత్వ పరంగా వారికి అందించిన పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, ఇతర వసతులను పరిశీలించారు. అన్ని తరగతి గదులను, కిచెన్, డైనింగ్ హాల్ తదితర వాటిని సందర్శించి అందుబాటులో ఉన్న సదుపాయాలను పర్యవేక్షించారు. స్టోర్ రూమ్ లో నిలువ ఉంచిన సరుకుల నాణ్యతను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గురుకులాల్లో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. గురుకులంలో సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని పేర్కొన్నారు. భోజనం విషయంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని శుచి, శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. వంటకు నాణ్యమైన సరుకులను వాడాలని, పిల్లల భోజనం విషయంలో అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు విద్యార్థులతో కలిసి పాఠశాలలోనే కలెక్టర్ నిద్రించారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు కలెక్టర్ సూచించారు.

## స్వయం సహాయక సంఘులకు బ్యాంకు రుణాలు ఇవ్వాలి

సిద్దిపేట, యదార్థవాది ప్రతినిధి, ఫిబ్రవరి 22: స్వయం సహాయక సంఘ సభ్యులందరికి నిర్దేశించిన బ్యాంకు లింకేజి రుణాలను సకాలములో అందించి ఉపాధులు పెంచాలని అడిషనల్ కలెక్టర్ గరిమా అగర్వాల్ అన్నారు. శనివారం సిద్ధిపేట కల్లెక్టరేట్ లో జరిగిన జిల్లా స్థాయి సెర్ప్, మెప్మా ఉద్యోగుల సమీక్ష సమావేశానికి హాజరై యస్.హెచ్.జి బ్యాంకు లింకేజి రుణాలను, ఇందిరా మహిళా శక్తి-ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ లను, పాడి పశువుల కొనుగోలు యూనిట్స్ ను, యునిఫారం స్టిచింగ్ పై మండల స్థాయి ఎ.పి.యం, సి.సి లను రివ్యూ చేయడం నిర్వహించారు. 2024-25 ఆర్థిక సం,, లో రూ,, 895.61 కోట్ల యస్.హెచ్.జి బ్యాంకు లింకేజి రుణాలను అందించవలసి ఉండగా రూ,, 831.98 కోట్ల రుణాలను అందించడం జరిగిందని మిగిలిన రూ,, 63.62 కోట్ల బ్యాంకు లింకేజి రుణాలను మార్చ్,7 లోపు అందించి అన్ని మండలాలు 100శాతం టార్గెట్ పూర్తి చేయాలని, మెప్మా ఉద్యోగులు కూడా తదనుగుణంగా చర్యలు తీసుకోవాలని, అలాగే యన్.పి.ఎ ఉన్న యస్.హెచ్.జి లకు యం.సి.పి లు చేయకూడదని, టి.జి.బి బ్యాంకు పరిధిలో చాలా కాలంగా యం.సి.పి లు పెండింగ్ ఉన్నందున సత్వర చర్యలు తీసుకోవలసినదిగా యల్.డి.యం కి సూచించారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాలలో ప్రత్యేక చొరవ చూపి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్స్ గ్రౌన్డింగ్ జరిగేలా చూడాలని, పాడి పశువుల యూనిట్ ల గ్రౌన్డింగ్ ను వచ్చే సమీక్ష సమావేశము లోపు పూర్తి చేయాలని ఎ.పి.యం, స్త్రీ నిధి స్టాఫ్ ను ఆదేశించారు. డి.ఆర్.డి.ఓ జయదేవ్ ఆర్య మాట్లాడుతూ బ్యాంకు లింకేజి ను జిల్లా లో మొదరి వరుస లో ఉంచడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని, బ్యాంకు లో సబ్‌మిట్ చేసిన ప్రతి యం.సి.పి సాంక్షన్ జరిగేల చూడాలని, గత సంవత్సరం విద్యార్థులకు యునిఫార్మ్ సకాలములో అందించి ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్ నుండి స్వయం సహాయక సంఘాలు మంచి పేరును పొందాయని, అదే స్ఫూర్తితో ఈ సంవత్సరం కూడా సకాలములో విద్యార్థులకు స్కూల్ యునిఫార్మ్ స్తిచింగ్ చేసిన అందించడానికి తరగతుల వారిగా కొలతలు తీసుకొని రిపోర్ట్ అందిచాలని తెలిపినారు. ఈ కార్యక్రమములో యల్.డి.యం హరి బాబు గారు, పి.డి-డి.యం.సి కె,హనుమంత రెడ్డి, అడిషనల్ డి.ఆర్.డి.ఓ టి.మధుసూదన్, డి.పి.యమ్స్, ఎ.పి.యమ్స్, సి.సి లు, టి.యం.సి లు తదితరులు పాల్గొన్నారు.

దేశాలకు సహాయం చేయడం సౌదీ అరేబియా సంప్రదాయమని ఆ దేశానికి చెందిన మీడియా ఎడిటర్లు, వ్యాఖ్యాతలు తెలిపారు. యూరోప్, పశ్చిమాసియాలో చెలరేగుతున్న వివాదాలను పరిష్కరించడానికి సౌదీ అరేబియా తటస్థ వేదికగా నిలవడం అకస్మాత్తుగా జరగలేదని తెలిపారు. రియాద్‌లో జరుగుతున్న సౌదీ మీడియా ఫోరంలో ఈ వ్యాఖ్యలు చేశారు. గాజాలో యుద్ధం నివారించడానికి అమెరికా %-% రష్యా చర్చలకు, మినీ-అరబ్ శిఖరాగ్ర సమావేశానికి ఆతిథ్యం ఇవ్వడంలో సౌదీ అరేబియా పాత్ర అరబ్‌దేశాల ప్రయోజనాలు రక్షించడంలోనూ, ఈ ప్రాంతం స్థిరత్వాన్ని కాపాడుకునే లక్ష్యంతో ఉంటుందని అన్నారు. '2011 తరువాత సిరియన్లు వివిధ దేశాలకు శరణార్థులుగా వెళ్లినప్పుడు వారిపై అనేక ఆంక్షలు విధించారు. సౌదీ అరేబియాలో ఆశ్రయం పొందిన సిరియన్లపై ఎలాంటి ఆంక్షలు విధించలేదు. వారు కోరుకున్నచోట పనిచేయడానికి, నివసించడానికి అనుమతి ఇచ్చారు. ఈ స్ఫూర్తితోనే బాధిత భాగస్వామ్య దేశాల కోసం సౌదీ అరేబియా తన శక్తి మేరకు చర్చల కోసం అవకాశాలను కల్పిస్తుందని ఓకాజ్ వార్తాపత్రిక ఎడిటర్ ఇన్ చీఫ్ జమీల్ అల్ ధియాబి తెలిపారు. మరో సీనియర్ జర్నలిస్టు, వ్యాఖ్యాత మిషారీ అల్ దైదీ మాట్లాడుతూ 'సద్దాం హుస్సేన్ అధ్యక్షుడుగా ఉన్న సమయంలో ఇరాక్ తన సైన్యాన్ని కువైట్‌లోకి పంపినప్పుడు, కువైట్ అధ్యక్షుడు, వారి కుటుంబం కోసం సౌదీ అరేబియా తన సరిహద్దులను తెరిచిందని' గుర్తు చేశారు. గాజాలోని పాలస్తీనా జనాభాను ఇతర అరబ్ దేశాలకు తరలించాలనే ట్రంప్ ప్రతిపాదనను మొదటగా వ్యతిరేకించిన దేశం సౌదీ అరేబియా అని తెలిపారు. ఇజ్రాయిల్‌తో సౌదీ అరేబియాకు ఎలాంటి వివాదం లేదని, కానీ పాలస్తీనా అరబ్ ముస్లిం దేశం అనే వైఖరిపై స్పష్టంగా ఉన్నామని చెప్పారు. ఇజ్రాయిల్ - పాలస్తీనా మధ్య సంక్షోభాన్ని నివారించడానికి రెండు దేశాల ఏర్పాటే పరిష్కారమే మార్గమని మరోసారి స్పష్టం చేశారు.



నాగారం అనే పల్లెటూరులో ఒక చిన్న కుటుంబం నివసిస్తూ ఉండేది. విద్య అనే 10 సంవత్సరాల అమ్మాయి ఆ కుటుంబంలో గారాల బిడ్డ. ఆటపాటలలో, చదువులో చాలా చురుకుగా ఉండేది. ఆ ఊరిలో ప్రభుత్వ పాఠశాల లేనందువలన పక్క ఊరికి వెళ్లి చదువుకోవాల్సి వచ్చేది. ఆ ఊరు మూఢనమ్మకాలకు పెట్టింది పేరు. 'ఆడపిల్లలు చదువుకోవద్దు, ఆడపిల్లలకు చదువు అవసరం లేదు' అనేది ఆ ఊరి ప్రజల యొక్క అభిప్రాయం. అందుకే చిన్న వయసులోనే అమ్మాయిలకు పెళ్లిళ్లు చేసేవారు. ఆ ఊరిలో ఉన్నత విద్య చదివిన అమ్మాయిలు ఎవరూ లేరు. విద్య వాళ్ళ నాన్నకు, నానమ్మ, తాతకు విద్య చదువు కోసం వేరే ఊరికి వెళ్లడం ఏమాత్రం ఇష్టం లేదు. కానీ వాళ్ళ అమ్మకు అది నచ్చలేదు. తన కూతుర్ని బాగా చదివించాలని, మంచి ఉద్యోగం చేయించాలని కోరిక. కానీ తన భర్త, అత్తమామలు అందుకు ఒప్పుకోలేదు. విద్యకు కూడా బాగా చదువుకోవాలని కోరిక. మంచి ఉద్యోగం చేయాలని, తన కుటుంబానికి ఆసరాగా ఉండాలని, ఆ ఊరిని మార్చాలని తనకు బలంగా ఉండేది. అందుకే తను చదువుకుంటానని పోరు పెట్టింది. చదువుకోవడం ఆ ఊర్లో ఉన్న వాళ్లకు అస్సలు నచ్చలేదు. కానీ విద్య ఎవరి మాటలు వినకుండా తన పని తాను చేసుకుంటూ వెళ్ళేది. ఎన్నో కష్టనష్టాలు వోర్చుకొని, పదవ తరగతి వరకు ఓపికతో చదువుకుంది. పదవ తరగతి పరీక్షలలో మంచి మార్కులు సాధించి, అందరి మెప్పును పొందింది. ఆ విషయం వార్తాపత్రికలలో విద్య ఫోటోతో సహా ప్రచురించారు. టీవీలలో ఆ అమ్మాయి గొప్పతనం గురించి ప్రచారం చేశారు. ఆ జిల్లా కలెక్టర్ విద్యని సన్మానించి, ఎంతగానో మెచ్చుకున్నారు. బాలికలు చదువు యొక్క గొప్పతనం గురించి, బాలికలు చదువుకుంటే సమాజం ఎలా బాగుపడుతుంది అని తెలియజేస్తూ పేపర్ ప్రకటన రావడంతో ఆ అమ్మాయిని అందరూ ప్రశంసించడం, ఆ ఊరి వారందరినీ ఆలోచింపజేసింది. నాగారం గ్రామ ప్రజలు వారి కుమార్తెల జీవితాలను బాల్యవివాహాలతో ఎలా నాశనం చేస్తున్నారో తెలుసుకొని కన్నీరు మున్నీరయ్యారు. తమ తప్పుని తెలుసుకున్నారు. విద్య సాధించిన ఫలితానికి మనస్ఫూర్తిగా అభినందన తెలియజేసారు. వారి తప్పును తెలుసుకొని క్షమించమని కోరారు. అప్పటి నుండి మిగతా వారు కూడా అమ్మాయిలను చదువు కోసం వేరే ఊరికి పంపించసాగారు.

**బాల్య వివాహాలు వద్దు బాలికల చదువు ముద్దు.**

# చెట్లు నరకితే కఠిన చర్యలు

## మొక్కల రక్షణకు ఏర్పాట్లు

నిజామాబాద్, యదార్థవాది ప్రతినిధి, ఫిబ్రవరి 22: మొక్కల పెంపకంలో అందరూ భాగస్వాములై విజయవంతం చేయాలని జిల్లా అటవీ అధికారులు అన్నారు. అక్రమంగా చెట్లను నరికే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. కోతుల బెడద పేరుతో చెట్లను నరుకుతున్నారని అన్నారు. ఇలా చేయడం వల్ల గ్రామాల్లో పచ్చదనం కరువవుతుందన్నారు. చివరకు పీల్చడానికి గాలికూడా దక్కదని అన్నారు. ఎవరైనా అనుమతి లేకుండా చెట్లను నరికినా, దొంగకర్ర ఎగుమతి చేసినా తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. మానవాళికి ప్రాణవాయువును అందించే చెట్ల సంరక్షణ పౌరుల సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. మొక్కల నర్సరీల్లో ఎండాకాలం వాటిని కాపాడడానికి అటవీ శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను ఎండల నుంచి కాపాడటానికి సన్నాహాలు చేస్తున్నారు. మొక్కలు ఎండల నుంచి తట్టుకునేలా షెడ్‌నెట్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఏడాది మొక్కలను నాటి టార్గెట్ పూర్తిచేయడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఫారెస్ట్ రేంజ్ అధికారి ఒకరు అన్నారు. ఎండల నుంచి మొక్కలకు రక్షణ ఉండేందుకు గ్రీన్‌షెడ్‌నెట్‌లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. మొక్కల పెంపకంపై ఎప్పటికప్పుడు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. వీటి పెంపకంలో క్షేత్రస్థాయి సిబ్బందిని కూడా అలర్ట్ చేశాం.గ్రామప్రాంతాల్లో మొక్కలు నాటడానికి అనువుగా అన్నీ సిద్ధం చేశామని అన్నారు. పంపిణీ చేయడానికి మొక్కలను వననర్సరీల్లో సిద్ధం చేసామన్నారు. ఆయా నర్సరీల్లో గ్రామాల్లో అందజేయడానికి మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. వివిధ రకాల నీడనిచ్చే, పండ్ల, పువ్వుల మొక్కలను సైతం పెంచుతున్నారు. ప్రధానంగా టేకు, వేప, కానుగ, ఖర్జూర, ఈత, నెమలినార, చింత, దానిమ్మ, జామ, గుల్మోర్గ, మర్రి, రావి తదితర మొక్కలు అందుబాటులో ఉన్నాయి. వేసవిని తట్టుకునే మొక్కలు కూడా ఉన్నాయి. కాగా ఎండల నుంచి మొక్కలను కాపాడుకోవడానికి షెడ్‌నెట్‌లను విరివిగా ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే ఉన్నత స్థాయి అధికారులు కూడా నర్సరీలను సందర్శించి మొక్కల వివరాలను సేకరించారు.

# కనీస రహదారికినోచుకోని గిరి పల్లెలు

## గూడాల్లో కానరాని మంచినీటి సౌకర్యం

భద్రాచలం, యదార్థవాది ప్రతినిధి, ఫిబ్రవరి 22: జిల్లావ్యాప్తంగా అనేక గ్రామాల ప్రజలు నేటికీ రహదారి సౌకర్యానికి నోచుకోవడం లేదు. రాళ్లతో నిండిన బాటలతో నడక సాగిస్తూ నానా పాట్లు పడుతున్నారు. అనేక గ్రామాలకు కాలిబాటలు కూడా లేవు. నేటికీ డోలీలు ఆశ్రయిస్తున్నారు. గిరిజన గ్రామాలుఅనేకం రవాణాకు దూరంగా ఉన్నాయి. దీంతో ఇతర గ్రామాలకు వెళ్లడానికి నానా ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సమయంలో ఇతర గ్రామాలకు వెళ్లాలన్నా, పంటలను విక్రయిద్దామన్నా కొండలను ఎక్కి దిగాల్సి వస్తుంది. రహదారి, తాగునీరు సౌకర్యం లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. సమస్యలు గుర్తించి వాటిని పరిష్కరించాలని స్థానిక గిరిజన సంఘాలు కోరుతున్నాయి. అనేక గిరిజన గ్రామాల్లో నేటికీ విద్యుత్ సౌక్యం లేకుండా పోయింది. ఇలాంటి గ్రామాల్లో అభివృద్ధి మాటెలా ఉన్నా అక్కడికి చేరుకోవడానికి దారులు కూడా లేవు. గిరి ప్లలెలకు రహదారి, విద్యుత్తు సౌకర్యం కల్పించ డానికి కృషి చేయాలని ఆదివాసీలు కోరుతున్నారు. ఆయా గూడాల్లోని గ్రామాల్లో ఒక్కగానొక్క బోరు మాత్రమే ప్రజల నీటి అవసరాలను తీరుస్తోంది. అనేక గ్రామాల్లో ఇప్పటికీ చెలిమెలు, వాగు నీటితోనే గొంతు తడుపుకొంటున్నారు. గిరిజనుల గ్రామాల్లో కనీస మౌలిక సదుపాయాలు కరవయ్యాయి. ప్రధానంగా అంటువ్యాధులు ప్రబలే ప్రమాదంతో పలుచోట్ల గ్రామీణులు నాటు వైద్యాన్ని ఆశ్రయిస్తున్నారు. గ్రామాలకు నేటికీ రహదారుల లేక ప్రజలు ఇతర గ్రామాలకు రాకపోకలు సాగించడానికి నానా అవస్థలు పడుతున్నారు. దట్టమైన అడవుల్లో, మొనదేలిన రాళ్ల మధ్య నడుస్తూ బతుకుపోరాటం చేస్తున్నారు. ఇక చినుకు పడితే కాలు తీసి ముందుకు వేయలేని విధంగా బురద దారులు, వంతెనలు లేని అనేక గ్రామాల ప్రజలు వర్షాకాలం బాహ్య ప్రపంచానికి దూరం అవుతున్నారు. విద్యుత్ వెలుగులు, తాగు నీరు, రహదారులు వంటి సదుపా యాలు కొరవడిన గ్రామాల్లో ప్రజలు అవస్థలుపడటం పరిపాటిగా మారింది. ఓటర్లుగానే తప్పితే మనుషులుగా తమను నాయకులు గుర్తించడం లేదంటూ గిరిజనులు వాపోతున్నారు. కొండకొనలతో సహజీవనం చేస్తూ, మౌలిక సదుపాయాలు కొరవడి అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్న పల్లెలపై నేతలు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

# బెంగళూరులో దారుణ ఘటన

## మాటుల కలిపి మహిళపై నలుగురు అత్యాచారం

## ఫిర్యాదుతో నలుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు

బెంగళూరు, యదార్థవాది ప్రతినిధి, ఫిబ్రవరి 22: బెంగళూరులో దారుణ ఘటన చోటుచేసుకుంది. కోరమంగళ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ హోటల్‌లో 33 ఏళ్ల మహిళపై నలుగురు యువకులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం జ్యోతి నివాస్ కాలేజీ జంక్షన్ వద్ద తాను వేచి ఉండగా.. దాదాపు 20 ఏళ్ల వయసు ఉన్న నలుగురు యువకులు వచ్చి తనతో మాటలు కలిపారని.. ఆ తర్వాత స్నేహంగా మెలిగి డిన్నర్‌కు ఆహ్వానించినట్లు బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొన్నట్లు పోలీసులు వెల్లడించారు. డిన్నర్ పూర్తయ్యాక ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించి.. ఓ ప్రైవేటు హోటల్ టెర్రాస్‌పైకి తీసుకెళ్లి సామూహిక అత్యాచారానికి ఒడిగట్టినట్లు పోలీసులు తెలిపారు. ఈ విషయం గురించి ఎవరికీ చెప్పొద్దని ఆమెను బెదిరించి.. శుక్రవారం ఉదయం 6గంటలకు విడిచిపెట్టారని పేర్కొన్నారు. ఉదయం ఇంటికి చేరుకున్నాక జరిగిన దారుణం గురించి భర్తకు వివరించగా.. పోలీసులను ఆశ్రయించినట్లు తెలిపారు. బాధిత కుటుంబం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై డిప్యూటీ కమిషనర్ సారా ఫాతిమా మాట్లాడుతూ.. శుక్రవారం ఉదయం 7.30 -8గంటల సమయంలో ఈ ఘటనపై తమకు సమాచారం అందిందన్నారు. ఈ దారుణానికి ఒడిగట్టిన నలుగురు నిందితులను అరెస్టు చేసి.. బాధితురాలికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వెల్లడించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం బాగానే ఉన్నట్లు తెలిపారు. అయితే, ఆ యువకులతో ఆమె ఎందుకు వెళ్లారనే విషయాన్ని తెలుసుకొనేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. దిల్లీకి చెందిన ఈ మహిళ తన భర్తతో బెంగళూరులో స్థిరపడ్డారని, ఆమె క్యాటరింగ్ సర్వీసెస్‌లో పనిచేస్తుందని పోలీసులు వివరించారు. నిందితులు తమ స్నేహితుడిని కలిసేందుకు అక్కడికి వెళ్లినట్లుగా ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు. అయితే, ఈ నలుగురికీ ఒకరితో మరొకరికి పరిచయం ఉందా? అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. నిందితుల్లో ముగ్గురు పశ్చిమ బెంగాల్‌కు చెందినవారు కాగా.. ఒకరు ఉత్తరాఖండ్‌కు చెందినవారిగా గుర్తించారు. వీరంతా వివిధ హోటళ్లలో చెఫ్‌లు, వెయిటర్లు, హెల్పర్లుగా పనిచేస్తున్నారని పోలీసులు తెలిపారు.

# పార్టీ ఇమేజ్ కే కాషాయం ప్రాధాన్యం

న్యూఢిల్లీ, యదార్థవాది ప్రతినిధి, ఫిబ్రవరి 22: దేశ రాజధాని న్యూఢిల్లీకి తదుపరి ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం చేశారు. న్యూఢిల్లీ సీఎంగా రేఖా గుప్తా పేరును బీజేపీ ప్రకటించింది. బుధవారం సాయంత్రం రాజధానిలో బీజేపీ లేజిస్లేటివ్ మీటింగ్ జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి పేరును బీజేపీ అగ్రనాయకత్వం ప్రకటించింది. రేఖ గుప్తాను ఆ పార్టీ ఎమ్మెల్యేలంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అయితే రేఖాగుప్తా తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచారు. ఆ వెంటనే సీఎం సీటును జాక్ పాట్ గా కొట్టేశారు. ఆమె షాలిమార్ బాగ్ అసెంబ్లీ నియోజక వర్గ నుంచి బీజేపీ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. దీంతో బీజేపీ 27ఏళ్ల కలను సాకారం చేసుకుంది. వాస్తవానికి బీజేపీలో సీఎంల ఎంపిక సాఫీగా కొనసాగుతుంది. ఎంత మంది సీనియర్లు సీఎం సీటు కోసం పోటీ పడినప్పటికీ వారందరినీ కూల్ చేసి.. ఆ పార్టీ పెద్దలైన మోదీ, అమిత్ షా ఎవరికి సీఎం పదవి అప్పగించాలని అనుకుంటారో వారికే అప్పగిస్తారు. ఈ క్రమంలోనే ఢిల్లీలో రేఖా గుప్తాకు




ముఖ్యమంత్రిగా అవకాశం ఇచ్చారు. దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్న రాజధాని ఢిల్లీకి ఫస్ట్ టైం ఎమ్మెల్యేను సీఎంగా బీజేపీ ప్రకటించడంతో రాజకీయ వర్గాలు ఆసక్తిగా గమనించాయి. చాలా మంది సీనియర్ నేతలను కాదని ఈమెకు బీజేపీ అధిష్టానం ఇంత ప్రియారిటీ ఇచ్చిందో అని ఆలోచనలో పడ్డారు. ఎమ్మెల్యేగా కూడా రాజకీయ అనుభవం లేని మహిళను సీఎం స్థానంలో కూర్చోబెట్టడంలో బీజేపీ హైకమాండ్ ప్లాన్ ఏంటని అనుకుంటున్నారు. రేఖా గుప్తా ప్రమాణ స్వీకారం చేసిన మరుక్షణం నుంచి రాజకీయ వర్గాల్లో ఈ ప్రశ్నలు చక్కర్లు కొడుతున్నాయి.ఢిల్లీలో 48 స్థానాల్లో బీజేపీ గెలిచినప్పటి నుంచి ఢిల్లీ సీఎం వీళ్లు అవుతారంటూ చాలా మంది పేర్లు వినిపించాయి. కానీ బీజేపీ మొదటి నుంచే మహిళను సీఎం చేయాలని భావిస్తుంది. ఈ క్రమంలో బన్సూరీ స్వరాజ్, స్మృతీ ఇరానీ పేర్లు తెరమీదకు వచ్చాయి. కానీ అనూహ్యంగా రేఖా గుప్తా పేరును బీజేపీ హైకమాండ్ ప్రకటించింది. సీఎం పదవి కోసం చాలా మంది వారసులు పోటీ పడ్డారు. కేజ్రీవాల్ ను ఓడించిన పర్వేశ్ వర్మతో పాటు సుష్మస్వరాజ్ కూతురు కూడా లైన్లో ఉన్నారు. కానీ వారందరినీ కాదని రేఖా గుప్తాను అవకాశం ఇచ్చారు.అంతకు ముందు మహారాష్ట్ర, హర్యానా, మధ్యప్రదేశ్, రాజస్థాన్ లాంటి రాష్ట్రాల్లో కూడా ఊహించని పేర్లను ప్రకటించారు మోదీ, షా. మధ్యప్రదేశ్ సీఎంగా శివరాజ్ సింగ్ చౌహాన్ ను కాదని మోహన్ యాదవ్ ను సెలక్ట్ చేశారు. చౌహాన్ కు మధ్యప్రదేశ్ లో భారీ క్రేజ్ ఉంది. అయినా సరే ఆయనను కేంద్రానికే పరిమితం చేశారు. కొత్త నాయకత్వానికి అవకాశం అందించారు. రాజస్థాన్ లో వసుంధర రాజే వంటి వారు గట్టిగా ఒత్తిడి తెచ్చినప్పటికీ భజన్ లాల్ శర్మకు ఛాన్స్ ఇచ్చారు. మహారాష్ట్రలో దేవేంద్ర ఫడ్నవీస్ కు అవకాశం ఇవ్వడానికి ఆయన సీఎంగా చేసి.. డిప్యూటీ సీఎంగా ఉండటానికి ఏ మాత్రం సంకోచించకపోవడమే కారణం. హర్యానాలో కూడా నాయబ్ సింగ్ సైనీకి అవకాశం కల్పించారు.మోదీ, అమిత్ షాల వెనుక ఈ సెలక్షన్ పద్ధతి పార్టీ బలోపేతం కావాలి కానీ నాయకులకు వ్యక్తిగత ఇమేజ్ పెరగకూడదన్న కారణం ఉందని అనుకోవచ్చు. బీజేపీ ప్రస్తుత ముఖ్యమంత్రులంతా కూడా ఓ రకంగా పాపులారిటీ లేని వారే. ఒక్క ఆదిత్యనాథ్ మాత్రమే ప్రస్తుతం కాస్త ఇమేజ్ ఉన్న ముఖ్యమంత్రి. పార్టీ కన్నా ఎక్కువగా ఏ నేత బీజేపీలో పాపులర్ కాకూడదన్నది బీజేపీ అగ్రనేతల వ్యూహం అని అంటున్నారు.

# క్రమబద్ధీకరణకు ఓకే...

హైదరాబాద్, యదార్థవాది ప్రతినిధి, ఫిబ్రవరి 22: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు తీపి కబురు చెప్పింది. చాలా కాలంగా పెండింగ్‌లో ఉంటూ ప్రజలకు, రియల్ ఎస్టేట్ రంగానికి ఇబ్బందిగా మారిన ఎల్‌ఆర్‌ఎస్ పై కీలక నిర్ణయం తీసుకుంది. అనుమతి లేని లేఅవుట్ల క్రమబద్ధీకరణ(ఎల్‌ఆర్‌ఎస్)కు రేవంత్ సర్కార్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారానికి మార్గం సుగమమైంది.కేవలం మూడు నెలల్లో తేల్చి క్రమబద్ధీకరించాలన్న ప్రభుత్వ ఆదేశాలతో అధికారులు రంగంలోకి దిగేశారు. క్షేత్రస్థాయిలో దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించేందుకు ప్రత్యేక టీమ్ లను రెడీ చేశారు. గడిచిన నాలుగేళ్లుగా పెండింగులోవున్న ప్లాట్లకు రిజిస్ట్రేషన్ చేసుకునే ఎట్టకేలకు మార్గం సుగమమైంది. ఎల్‌ఆర్‌ఎస్ ఫీజులోనూ 25 శాతం రాయితీ ఇచ్చింది ప్రభుత్వం.సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో నేరుగా క్రమబద్ధీకరణ ఫీజును చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. మార్చి 31లోగా రిజిస్ట్రేషన్లను పూర్తి చేసుకున్నవారికి మాత్రమే ఎల్‌ఆర్‌ఎస్ ఫీజులో రాయితీ వర్తించనుంది. బుధవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీధర్‌బాబు, సీఎస్ శాంతికుమారి ఆధ్వర్యంలో ఈ అంశంపై సమీక్ష జరిగింది.ఎల్‌ఆర్‌ఎస్ స్కీమ్‌ను వేగంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని పేర్కొంది. అనుమతి లేని లే అవుట్ల ప్లాట్ల రిజిస్ట్రేషన్లపై గతంలో ప్రభుత్వం నిషేధం విధించింది. వాటిని కొనుగోలు చేసినవారికి నాలుగేళ్లుగా రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం లేకుండా పోయింది. వీరందరికీ ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది.వ్యక్తిగతంగా ప్లాట్లు కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ పెండింగులో ఉన్నవారు.. లే అవుట్లలో విక్రయం కాకుండా పెద్ద సంఖ్యలో మిగిలిన ప్లాట్లకు కూడా క్రమబద్ధీకరణ అమలయ్యేలా ప్రస్తుతం వెసులుబాటు కల్పించింది ప్రభుత్వం. ఒక లే అవుట్‌లో 10 శాతం ప్లాట్లు రిజిస్టర్ అయ్యాయి. మిగిలిన 90 శాతం ప్లాట్లు రిజిస్టరు కాలేదు. ఎల్‌ఆర్‌ఎస్ కింద వాటి క్రమబద్ధీకరణతోపాటు రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పిస్తారు.ఇప్పటికే ప్లాట్లు కొనుగోలు చేసి విక్రయ దస్తావేజు కలిగిన వారంతా మార్చి 31లోగా స్పందిస్తే రాయితీ కూడా లభిస్తుంది. నాలుగేళ్లుగా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారం కోసం చాలామంది పేద ప్రజలు, రియల్ సెక్టార్ ఎదురు చూస్తోంది. వారి ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకున్న ప్రభుత్వం, ఈ వెసులుబాటు కల్పించింది. దాన్ని వినియోగించుకోవాలని మంత్రులు సూచించారు.ఎల్‌ఆర్‌ఎస్ అమల్లో పలు వెసులుబాట్లు కల్పిస్తున్నందున నిషేధిత జాబితాలోని భూముల ప్లాట్ల విషయంలో జాగ్రత్తగా ఉండాలని ఆదేశించారు. ప్రభుత్వం కల్పించిన వెసులుబాటులో ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. నేరుగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద సొమ్ము చెల్లించి రిజిస్ట్రేషన్లు చేసుకునే సౌకర్య కల్పించింది.అక్రమ లేఅవుట్లు, ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణకు అప్పటి బీఆర్‌ఎస్ సర్కారు ఎల్‌ఆర్‌ఎస్ (ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం)-2020 ను అమల్లోకి తెచ్చింది. రూ.వెయ్యి చొప్పున ఫీజు విధించి దరఖాస్తులు ఆహ్వానించింది. వారిలో చాలా మంది స్పందించారు. కొన్నింటిని పరిశీలించి పరిష్కరించారు. పలువురు కోర్టును ఆశ్రయించారు. దీంతో ఆ ప్రక్రియ మధ్యలో ఆగిపోయింది.ఈ మేరకు కోర్టు ఉత్తర్వులకు లోబడి ఫీజు చెల్లించి నిర్మాణాలకు అనుమతులు పొందారు కొందరు. అయితే మెజారిటీ దరఖాస్తులు మాత్రం పెండింగ్‌లో ఉండిపోయాయి. 14 శాతం ఫీజులు చెల్లించి భవన నిర్మాణాలకు అనుమతులు పొందారు. చాలా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం వీటిపై దృష్టి పెట్టడంతో కదలిక మొదలైంది.రాష్ట్రవ్యాప్తంగా 25 లక్షల ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు వచ్చినట్లు ప్రభుత్వ వర్గాల మాట. వాటిలో 9 లక్షలకు సంబంధించి మాత్రమే పరిష్కారం లభించింది. కేవలం 39 రోజుల్లో వీలైనన్ని దరఖాస్తులు పరిష్కరించాల్సి వుంది. రాయితీ ప్రకటించిన నేపథ్యంలో దరఖాస్తుదారులు ముందుకు రావచ్చని భావిస్తోంది ప్రభుత్వం.



**విజయవాడ, యదార్థవాది ప్రతినిధి, ఫిబ్రవరి 22:** ఏదైనా చేస్తే నమ్మేలా చేయాలి. అబద్ధం ఆడినా అద్దంలో ఉండాలి. లేకుంటే ఇబ్బందులు ఎదుర్కోవడం తప్పదు. రాజకీయాల్లో రకరకాల జిమ్మిక్కులు చేసే వ్యూహకర్తల బృందాలు వచ్చాయి. ఆపై సోషల్ మీడియా విభాగాలు చాలా రకాల కసరత్తులు చేస్తాయి. అయితే ఇప్పుడు అవి చేసే ప్రయత్నాలు ఇట్టే తెలిసిపోతున్నాయి. నిన్నటి కి నిన్న విజయవాడ సబ్ జైలులో ఉన్న వల్లభనేని వంశీ మోహన్ ను పరామర్శించారు జగన్మోహన్ రెడ్డి. ఆ క్రమంలో జైలు బయట జరిగిన ఓ ఘటన సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. జగన్మోహన్ రెడ్డి పై ఓ బాలిక పెంచుకున్న పిచ్చి ప్రేమ బయటపడింది. అయితే దీని వెనుక ఐపాక్ టీం ఉందని తేలిపోయింది. జగన్మోహన్ రెడ్డితనకంటే.. ఎక్కువగా నమ్మింది ఐప్యాక్ టీంనే. వాళ్లు నిలబడమంటే నిలబడతారు. కూర్చోమంటే కూర్చుంటారు. అంతలా ఉంటుంది జగన్మోహన్ రెడ్డి పై ఐప్యాక్ టీం ప్రభావం. 2019లో తన విజయానికి ఐ ప్యాక్ టీం కారణమని జగన్మోహన్ రెడ్డి బలంగా నమ్మారు. అయితే 2024లో ఓటమికి కూడా అదే ఐప్యాక్ కారణమని చెప్పిన జగన్మోహన్ రెడ్డి వినడం లేదు. ఇంకా వారినే నమ్ముకుంటున్నారు. దీంతో పాత చింతకాయ పచ్చడి మాదిరిగా వారు ఏవేవో స్కీములు వేస్తున్నారు. అందులో భాగంగానే విజయవాడ సబ్ జైలు వద్ద జరిగిన చిన్నారి యాక్షన్ అంటూ ప్రచారం నడుస్తోంది. విజయవాడ రోడ్ షోలో ఓ చిన్నారి ఏడుస్తూ జగన్ వద్దకు చేరుతుంది. తండ్రి భుజాల మీద కూర్చోబెట్టుకుని దగ్గరకు తీసుకెళ్లాడు. వ్యక్తి వ్యక్తి కుక్క పెట్టి జగన్మోహన్ రెడ్డి దగ్గర తీసుకున్నారు. ఆ పాప వెంటనే సెల్ఫీ తీసుకుని ఆనందించింది. అయితే అక్కడితో ఆ ఎపిసోడ్ ముగియలేదు. చదువుకున్న ఏడుపు ఆపేసి సెల్ఫీ తీసుకోవడమే ఫక్కున నవ్వు తెప్పించే అంశం. మొత్తం ఇది ఒక డ్రామాను తలపించింది. ఐ ప్యాక్ నాటకంగా భావించిన టిడిపి సోషల్ మీడియా వెతికి వెతికి మరి పట్టుకుంది. తెర వెనుక ఏం జరిగిందో వివరించే ప్రయత్నం చేసింది. అయితే అలా ఏడ్చిన చిన్నారి రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారిని.. ఆమె తండ్రి బంగారు నగల దుకాణంలో మంచి ఉద్యోగం చేస్తున్నాడని.. తల్లి కూడా ప్రైవేటు ఉద్యోగి అని.. పాప చదివేది రవీంద్ర భారతి స్కూలులో అని తేలిపోయింది. అంటే అది ఉన్నతమైన కుటుంబమే కదా. దీంతో ఈ టోటల్ వ్యవహారం ఒక ఫన్ ఎపిసోడ్ గా మిగిలిపోయింది. ఐప్యాక్ చేసిన నాటకాలుగా తేలిపోయింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీపై ఇదో ప్రతికూల ప్రభావం చూపుతోంది. ఈసారి నిజంగా జరిగిన ఘటనలను బయటపెట్టినా.. అదంతా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సృష్టి అని భావించేలా పరిస్థితికి వచ్చింది. చిన్నారి దేవిక చుట్టూ స్టోరీ: చిన్నారి దేవిక.. ఈ పేరు ఇప్పుడు మారుమోగిపోతోంది. ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్, ఫేస్‌బుక్ ఇలా ఏ సోషల్ మీడియా ప్లాట్ ఫార్మ్ ఓపెన్ చేసిన ఈ చిన్నారి పేరే వినిపిస్తోంది. అందుకు కారణం ఆ చిన్నారి వైఎస్ జగన్‌ను చూడాలంటూ ఏడుస్తూ మరీ ఫొటో దిగడం.. ఆ ఫొటో, వీడియోలు వైరల్ కావడం. వైసీపీ అధినేత, ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్ ఇటీవల వల్లభనేని వంశీ పరామర్శించేందుకు విజయవాడలోని జిల్లా కారాగారానికి వచ్చారు. దీంతో జగన్ ను చూడడానికి వైసీపీ

తీసుకోడు.. ఐ ప్యాక్ ఏమి చెప్తే అది చేస్తాడు" అంటూ ట్వీట్‌లో రాసుకొచ్చారు. ఇంకొరేమో "సొంత మేన అల్లుడి ఒ మేన కోడల్ని మోసం చేసినోడు.. ఊళ్ళో ఉన్నోళ్లకి మేన మామ.. వాళ్ళ వయసు ఏంటి చేయుస్తున్న పనులేంటి" అంటూ ట్వీట్ చేశారు. అలాగే స్వంత చెల్లిని, బాబాయి కూతురుని పేటిఎం బ్యాచ్‌తో బూతులు తిట్టించే ఈ మహానుభావుడు.. జనాల పిల్లల్ని మాత్రం ప్రేమగా చూస్తాడని నమ్మే వెర్రి గొర్రెలు ఆంధ్రాలో లేరని ఇంకా తెలియదా.. ఐ ప్యాక్ డ్రామాలు ఆపండ్రా.. చిరాకేస్తుంది అంటున్నారు. ఈ మేరకు కావాలనే వైసీపీ వాళ్లు ఈ డ్రామా చేయించారంటున్నారు. అక్కడి దిగిన ఫోటోలకు సంబంధించి కెమెరా యాంగిల్స్‌ను సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు. మరోవైపు ఆ చిన్నారి తల్లినే మార్చేసి.. వేరొకరితో పోల్చుతున్నారు. దీంతో రాజకీయాల కోసం ఆ చిన్నారి తల్లినే మార్చేసిన సోషల్ మీడియా సైకోలు అంటూ ఇంకొందరు విరుచుకు పడుతున్నారు. అలాగే మరొకరు "ఈ అభిమానం ఐప్యాక్ సొంతం, అసలు ఐప్యాక్ లేకపోతే మీకు ఇలాంటి వీడియోలు ఎక్కడ నుంచి వస్తాయ్..! మీ పేటీఎం బ్యాచ్‌కి దండాలు పెట్టాల్సింది" అంటూ అందుకు సంబంధించిన వీడియోలు షేర్ చేస్తున్నారు. "ఐ ప్యాక్ టీం రంగంలోకి దిగింది అనుకుంటా ఇంకా ఇలాంటివి ఎన్నో వస్తాయో. కానీ ప్రతీ సారి జనాలను మోసం చేయలేవు జగన్" అంటూ మరొకరు ట్వీట్ చేశారు. లా టీడీపీ ఫ్యాన్స్ విమర్శలు చేస్తుంటే.. వైసీపీ ఫ్యాన్స్ మాత్రం ఇలాంటి అభిమానం, ప్రేమ వైఎస్ జగన్‌కు మాత్రమే సొంతం అంటూ మరోవైపు వీడియోలు విస్తృతంగా షేర్ చేస్తున్నారు. ఇక ఆ చిన్నారి దేవిక అలాగే ఆమె ఫ్యామిలీపై కొందరు తీవ్రంగా విమర్శిస్తున్నారు. దేవిక తండ్రి ఓ షాప్‌లో పాట్నర్ అని ట్రోల్స్ చేస్తున్నారు. కానీ వాస్తవంగా ఆ చిన్నారి తండ్రి ఒక షాప్‌లో నెలవారీ జీతానికి పనిచేస్తున్నారని తెలిసింది. అలాగే వీరికి ఒక అపార్ట్‌మెంట్ ఉందని అంటున్నారు. కానీ వారు ఉండేది ఒక అపార్ట్‌మెంట్‌లోని అద్దెకు అని తెలుస్తోంది. ఇక ఆ చిన్నారి ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో చదువుతున్నట్లు ప్రచారం చేస్తున్నారు. అయితే వాస్తవం ప్రకారం.. దేవికా రవీంద్ర భారతిలో చదువుతున్నట్లు తెలిసింది. ఇక ఆ పాపపై ఎందుకు ఇన్ని ట్రోలింగ్స్ చేస్తున్నారని కొందరు ప్రశ్నిస్తున్నారు. ఈ చిన్నారి విషయంలో టీడీపీ, వైసీపీ ఫ్యాన్స్ సోషల్ మీడియాలో పోస్టుల యుద్ధం చేస్తున్నారు. ఎవరి వాదన వారు వినిపిస్తున్నారు. దీంతో ఎవరి వాదన కరక్టో తెలియక నెటిజన్లు జుట్టు పీక్కుంటున్నారు.



**పెద్దపల్లి, యదార్థవాది ప్రతినిధి, ఫిబ్రవరి 22:** మిషన్ భగీరథ ద్వారా సమీకృత జిల్లా కలెక్టరేట్లో ఏర్పాటుచేసిన త్రాగునీటి వాటర్ ట్యాప్ లను కలెక్టరేట్ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు సిబ్బంది వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సూచించారు. శనివారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో త్రాగునీటి వాటర్ ట్యాప్ లను ప్రారంభిం చారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ఒక యూవి ప్యూరిఫైర్ ప్లాంట్ ఏర్పాటు చేసి, మిషన్ భగీరథ బల్క్ నీటి సరఫరాకు అనుసంధా నం చేశామని, కలెక్టరేట్ లోని ప్రతి ఫ్లోర్ లో రెండు వాటర్ ట్యాప్ లను ఏర్పాటు చేశామ ని అన్నారు. యూవి ప్యూరిఫైర్ ప్లాంట్ ద్వారా మిషన్ భగీరథ బల్క్ నీరు శుద్ధి చేసి ట్యాప్ లో స్వచ్ఛమైన జలం మనకు వస్తుందని అన్నారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని అన్ని శాఖలు అధికారులు, సిబ్బంది త్రాగు నీటి ట్యాప్ లను వినియోగించుకోవాలని, ప్రైవేట్ వాటర్ ప్లాంట్ల నుంచి త్రాగునీరు కొనుక్కోవాల్సిన అవసరం లేదని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఇంట్రా ఈఈ గంగాధర శ్రీనివాస్, ఏ.ఓ. శ్రీనివాస్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ను సవరించాలి

**-సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు**



**మంథని, యదార్థవాది ప్రతినిధి, ఫిబ్రవరి 22:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ను సవరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు డిమాండ్ చేశారు. శనివారం సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ కార్మిక కర్షకులపై ప్రభావం అనే అంశంపై మంథని మునిసిపాలిటీ ఆవరణంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేష్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్లో కార్మిక కర్షకులకు తీవ్రమైన అన్యాయం చేసిందని అన్నారు. కార్మికుల కనీస వేతనాల ఊసే లేదని రైతులకు కనీసం మద్దతు ధర చట్టం గురించి ప్రస్తావించలేదని వ్యవసాయ కూలీలకు సమగ్ర చట్టం చేయాలనే డిమాండ్ ను పక్కన పెట్టి కార్మిక రంగాన్ని వ్యవసాయ రంగాన్ని వ్యవసాయ కూలీల బతుకుల ను కూని చేసిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాపెల్లి తిరుపతి, సీఐటీయూ నాయకులు రాజు, రైతు సంఘం నాయకులు ఆకుల శ్రీనివాస్, నాయకులు మంథని కిష్టయ్య, మల్లేష్, చందు, గట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఇటుక బట్టీలకు ఉచితంగా ఎన్టీపీసీ యాష్



**పెద్దపల్లి, యదార్థవాది ప్రతినిధి, ఫిబ్రవరి 22:** పెద్దపల్లి జిల్లాలో ఇటుక బట్టిలకు ఎన్టీపీసీ యాజమాన్యం యాష్ ఉచితంగానే అందిస్తోందని పెద్దపల్లి ప్రాంత ఇటుక బట్టీల యాజమాన్య సంక్షేమ సంఘం నాయకులు తెలిపారు. జిల్లా కేంద్రంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎంఎస్ఎం ద్వారా 114 యూనిట్ల యాష్ ఉచితంగా ఇటుక బట్టీలకు ఇచ్చేందుకు ఎన్టీపీసీ యాజమాన్యం అంగీకరించడంతో యాష్ వాడుతున్నామని పేర్కొన్నారు. బట్టీలకు తరలించే యాష్ వాహనాల్లో లోడింగ్ కోసం ఖర్చులు మాత్రమే తాము చెల్లిస్తున్నామని చెప్పారు. బూడిద చెరువు వద్దకు వాహనాలు వెళ్ళడానికి రోడ్లు, వాటర్ క్యూరింగ్, లోడింగ్ తదితర ఖర్చుల కోసం మాత్రమే తాము డబ్బులు చేల్లిస్తున్నామని, ఎలాంటి అవినీతి అక్రమాలు జరగడం లేదని చెప్పారు. రామగుండం ఎమ్మెల్యే మాక్కాన్ సింగ్ బటీలకు ఉచితంగా యాష్ ఇవ్వాలని అనేక సార్లు ప్రభుత్వం ద్వారా ఎన్టీపీసీ యాజమాన్యంపై తెచ్చిన ఒత్తిడి ఫలితంగా మాకు మేలు జరిగిందని అన్నారు. ఉచితం గా యాష్ తీసుకెళ్లేందుకు ఎన్టీపీసీ యాజమాన్యాన్ని ఒప్పించి అనుమతి ఇప్పించిన ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ కు బట్టీల యజమానులు కృతజ్ఞతలు తెలిపారు. బట్టీలకు సరఫరా అయ్యే యాష్ కు ఎవరూ తమవద్ద అక్రమంగా వసూల్ చేయడం లేదన్నారు. తమకు ఉచితంగా యాష్ అందిస్తున్న ఎన్టీపీసీ యాజమాన్యానికి, ప్రజా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, సిద్దయ్య, కొండయ్య, లక్ష్మన్ రావు, తదితరులు పాల్గొన్నారు.

# సిక్కోలు వైసీపీలో గ్రూపుల గోల



**శ్రీకాకుళం, యదార్థవాది ప్రతినిధి, ఫిబ్రవరి 22:** ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా వైసీపీలో గ్రూపుల గోల చల్లారడం లేదు. ఎన్నికలకు ముందు కూడా పార్టీలో గ్రూపు పాలిటిక్స్‌కు చెక్ పెట్టకపోవడంతో తీవ్ర నష్టం జరిగిందని అంటున్నారు క్యాడర్, లీడర్లు. వైసీపీ ముఖ్యనేతల దగ్గరే తమ ధిక్కార స్వరం వినిపిస్తున్నారట. ఇప్పుడైనా నియోజకవర్గ ఇంచార్జ్‌లను మార్చాలని లేకపోతే మరోసారి నష్టపోవాల్సి వస్తుందని పార్టీ పెద్దలకు తెగేసి చెప్తున్నారట క్యాడర్. అయితే ఇప్పటికే వైసీపీ అధిష్టానం కొంత నష్టనివారణ చర్యలు మొదలుపెట్టింది. ఆమదాలవలస నియోజకవర్గ ఇంచార్జ్ తమ్మినేని సీతారాం, టెక్కలి ఇంచార్జ్ దువ్వాడ శ్రీనివాస్‌ను తప్పించింది. తమ్మినేనికి పార్లమెంటరీ కోఆర్డినేటర్ బాధ్యతలు అప్పగించారు. ఎంపీగా పోటీ చేసి ఓడిపోయిన పేరాడ తిలక్‌కు టెక్కలి నియోజకవర్గ బాధ్యతలు ఇచ్చింది అధిష్టానం. ఇక మిగతా నియోజకవర్గాల్లో కూడా ఇంచార్జులను మార్చాలని పట్టుబడుతున్నారట క్యాడర్. ముఖ్యంగా ఎచ్చెర్ల నియోజకవర్గ ఇంచార్జ్ గొర్లే కిరణ్ కుమార్, రాజాం ఇంచార్జ్‌గా ఉన్న డాక్టర్ తలే రాజేష్, పాతపట్నం ఇంచార్జ్ రెడ్డి శాంతి, ఇచ్ఛాపురం ఇంచార్జ్ పిరియా విజయలను మార్చాలని పట్టుబడుతున్నారట వైసీపీ కార్యకర్తలు, లీడర్లు. ఎలక్షన్ తర్వాత రాజాం నియోజకవర్గ పరిస్థితి మరింత దయనీయంగా తయారైందంట. గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిన డాక్టర్ తలేరాజేశ్ ఇప్పుడు పేరుకే ఇంచార్జ్‌గా ఉన్నారట. పార్టీ కార్యక్రమాలకు కూడా పాల్గొనడం లేదట. అయితే రాజాం మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు ఇంచార్జ్‌గా ఉండేందుకు ఆసక్తి కనబరుస్తున్నారట. క్యాడర్ కూడా జోగులుకే జై కొడుతున్నారట. ఇక ఇచ్ఛాపురం నియోజకవర్గంలో గ్రూప్ పాలిటిక్స్ ఇబ్బందికరంగా మారాయట. ఎమ్మెల్సీ నర్తు రామారావు, జడ్పీ ఛైర్మన్ పిరియా విజయసాయిరాజ్ వేర్వేరు వర్గాలను మెయింటెన్ చేస్తున్నారు. దాంతో ఇచ్ఛాపురంలో కొత్త వ్యక్తికి ఇంచార్జ్ బాధ్యతలు ఇవ్వాలని కోరుతున్నారట స్థానిక నేతలు. ఇచ్ఛాపురంలో గ్రూపు రాజకీయాలకు చెక్ పెట్టాలంటే ఇంచార్జ్‌ను మార్చి కొత్త వ్యక్తిని నియమించాలంటున్నారట ద్వితీయ శ్రేణి నేతలు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు గ్రూపుల గోలతో నిత్యం రచ్చకెక్కేవి ఎచ్చెర్ల పాతపట్నం నియోజకవర్గాలు. ఈ రెండు నియోజకవర్గాల్లో ఇంచార్జ్‌లు, నాటి ఎమ్మెల్యేల తీరు నచ్చక పలువురు వైసీపీని విడిచిపెట్టి వెళ్లారు. గొర్లే కిరణ్‌ను మార్చాలని ఎచ్చెర్లలోని ఆయన వ్యతిరేక గ్రూపు డిమాండ్ చేస్తోందట. ఇక పాతపట్నంలో నాన్ లోకల్ అయిన రెడ్డి శాంతిని తప్పించి స్థానిక నేతలకు నియోజకవర్గ బాధ్యతలు కట్టబెట్టాలంటున్నారు క్యాడర్. ఘోర ఓటమి పాలైనా నేతల గ్రూపుల గోల మాత్రం చల్లారడక పోవడంతో కార్యకర్తలు విసిగిపోతున్నారట. అధిష్టానం దిద్దుబాటు చర్యలకు దిగుతుందో లేదోనని నిట్టూర్పుతో ఎదురు చూస్తున్నారట. సిక్కోలు నేతలను వైసీపీ అధినేత ఎంతవరకు సెట్ చేస్తారో చూడాలి మరి.

# మనసులో మాలిన్యం ప్రమాదం!

**తిరుమల, యదార్థవాది ప్రతినిధి, ఫిబ్రవరి 22:** మన ఆలోచనల్లో స్వచ్ఛత లేకపోతే, ఎన్ని ఆలయాలు సందర్శించి, ఎంతమంది దేవుళ్లను మొక్కుకున్నా లాభం లేదు. మాలిన్యంతో దేవుడిని పూజించినా ఫలితం ఉండదు. మరకత మాణిక్యాలతో అలంకరించి, సుగంధ పూలతో, వేద మంత్రాలతో పూజించినా పుణ్యం సంప్రాప్తించదు. మనసులో మాలిన్యం పెట్టుకుని స్వార్థంతో వ్యవహరించే వారిని భగవంతుగు కూడా దగ్గరకు రానీయడు. సమస్త జీవరాశి పట్ల కారుణ్య భావన కలిగి ఉండాలంటారు ద్రష్టలు. సాటి మనుషులను చిన్న చూపు చూసే మానవులు, జీవ జంతుజాలం పట్ల ఉదాత్తంగా, సమదృష్టితో ఎలా వ్యవహరించగలరు? ఈ భూమ్మీదకు వచ్చిన వాళ్లందరూ రక్తసంబంధం లేకపోయినా, మనకు భ్రాతృ సమానులే. అందరిలో తనను చూసుకునే వ్యక్తి ఉన్నత వ్యక్తిత్వం గల ఉత్తముడు. వయసుతో పాటు మనసు పరిధి విస్తృతం కావాలి. భూమ్మీద ముక్తి సంపాదించుకునే మార్గాలు ఇన్ని ఉన్నా, కారుచీకట్లో కొట్టుమిట్టాడటం మనిషికే చెల్లింది. 'ఎక్కడో ఏదో ఉందని కాక, ఇక్కడే భూమ్మీద, ఈ జన్మతో దాన్ని సాధించడమే జన్మ సార్థకత' అని తెలుసుకుంటే ముముక్షు భావనలు మనలో అంకురించినట్లే! ప్రతి మనిషిలోనూ ఈ మానవత్వ భావనలు వెల్లివిరిస్తే, భూలోకమే ముక్తిదాయక వనం. సర్వత్రా పరిశుద్ధాత్మలు సంచరించే పుణ్యస్థలమై స్వర్గతుల్యమై విలసిల్లుతుంది. సర్వేజనా సుఖినో భవంతు అన్న ఆర్యోక్తిని అంతా పాటించాలి.

# ఉచిత కంటి వైద్య శిబిరం పోస్టర్ ఆవిష్కరణ

**పేదవారి కోసం 220 రూపాయలకే ఉచిత కంటి ఆపరేషన్**



**కమాన్‌పూర్, యదార్థవాది ప్రతినిధి, ఫిబ్రవరి 22:** లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటనరీ కాలనీ రేకుర్తి కంటి ఆసుపత్రి కరీంనగర్ వారి సంయుక్త ఆధ్వర్యంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి అబ్బు కేశవరెడ్డి సహకారంతో ఈ నెల 24న సోమవారం రోజున ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు లక్కారం గ్రామ పంచాయతీ భవనం వద్ద ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఈ వైద్య శిబిరంలో కంటి చూపులో లోపాలున్న వారికి డాక్టర్లచే పరీక్ష చేయించి వారిలో మోతే బిందు (కంటిలో శుక్లాలు) ఉన్నవారిని గుర్తించి ఆపరేషన్ అవసరమైన వారిని వెంటనే రేకుర్తి కంటి ఆసుపత్రికి ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తూ కరీంనగర్ తీసుకువెళ్లి రేకుర్తి కంటి ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్ చేయించబడును. అలాగే ఆసుపత్రి నందు భోజనం, వసతి, కంటి అద్దాలు, మందులు ఉచితంగా ఇవ్వబడును. బయట కార్పొరేట్ ఆసుపత్రిలో ఇట్టి ఆపరేషన్ కి 15 నుండి 20వేల రూపాయలు ఖర్చు అవుతుంది కానీ పేదవారికి సహాయం చేయాలని సంకల్పంతో లయన్స్ క్లబ్ మరియు రేకుర్తి కంటి ఆసుపత్రి వారి సహకారంతో కేవలం 220 రూపాయలకే ఇట్టి ఆపరేషన్ చేయించడం జరుగుతుంది. కావున ముత్తారం మండల ప్రాంత ప్రజలు ఇట్టి అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరుతూ కంటి ఆపరేషన్ కి వచ్చి వారు తమ వెంట ఆధార్ కార్డు, తెల్ల రేషన్ కార్డ్ , మొబైల్ ఫోన్, బ్లాంకెట్ వెంట తీసుకొని రాగలరు, రక్త పరీక్షల నిమిత్తము 220 రూపాయలు తెచ్చుకోగలరని కోరారు. మరిన్ని వివరాలకు అబ్బూ కేశవ రెడ్డి 9849885837, గంట వెంకటరమణ రెడ్డి 9849655990లను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు మొలుమురి శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ ,క్లబ్ డైరెక్టర్ గంట వెంకటరమణ రెడ్డి,మాజీ ఎంపీపీ అత్తే చంద్రమౌళి, ఉపాధ్యక్షులు కదార కళాధర్ రెడ్డి, శ్రీధర్ ,గ్రామ కార్యదర్శి దిలీప్ ,క్లబ్ సభ్యులు మేకల మారుతి యాదవ్, తాళ్లపల్లి చంద్రమౌళి, మద శ్రీకాంత్ పాల్గొన్నారు.



# విద్యుత్ షాక్!

అమరావతి, యదార్థవాది ప్రతినిధి, ఫిబ్రవరి 22: విద్యుత్ చార్జీలు పెంచడం లేదంటూనే వినియోగదా రుల జేబులకు కత్తెర వేసే టైమ్ ఆఫ్ డే టారిఫ్ విధానాన్ని చిరు వ్యాపారులకు సైతం అమలు చేస్తామని ప్రకటించడం దారుణం. తప్పనిసరిగా విద్యుత్‌ను వినియోగించాల్సిన సమయాల్లో చార్జీల మోత మోగిస్తారు. డిమాండ్‌ను బట్టి చార్జీలు విధించే ఈ విధానాన్ని రాష్ట్రంలో విస్తృతంగా అమలు చేయడానికి ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపిఇఆర్‌సి) అనుమతి ఇవ్వడం విచారకరం. విద్యుత్ రంగంలో సంస్కరణలు అమలు చేసే రాష్ట్రాలకే కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహకాలను, రాయితీలను ఇస్తామని తాజాగా బడ్జెట్ ప్రతిపాదనల్లో పేర్కొన్న విషయం అందరికీ తెలుసు. సంస్కరణల బాటలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరుగులు తీస్తున్న నేపథ్యంలో ఈ టిఒడి చార్జీల విధానం గృహ వినియోగదారుల తలుపు తట్టడానికి ఎక్కువ సమయం పట్టకపోవచ్చు. ఇది శాంపిల్ మాత్రమే! వినియోగదారులు ఏ సమయంలో ఎంత విద్యుత్ వినియోగించారని తెలుసుకోవాలంటే స్మార్ట్ ప్రీ పెయిడ్ మీటర్లు తప్పనిసరి కానున్నాయి. రాష్ట్రంలో వాటిని అమర్చే కాంట్రాక్ట్‌ను దక్కించుకున్న అదాని కంపెనీ 59,21,344 మీటర్లను బిగించనుంది. అదాని స్మార్ట్ మీటర్ల కోసమే టైం ఆఫ్ డే టారిఫ్ విధానాన్ని అమలు చేస్తున్నారని విద్యుత్ నిపుణులు పేర్కొంటున్న విషయం సత్య దూరం కాదు. టిఒడి విధానాన్ని అనుమతించొద్దని ఇఆర్‌సి నిర్వహించిన బహిరంగ విచారణలో సిపిఎంతో పాటు ప్రజాసంఘాలు, పరిశ్రమలు కూడా డిమాండ్ చేశాయి. విద్యుత్ చార్జీలు పెంచబోవడం లేదని, గతంలో ఉన్న చార్జీలో దెబ్బతిన్నది. ఇప్పుడు టిఒడి పేరిట సాయంత్రం ఆరు గంటల నుండి రాత్రి పది గంటల వరకు యూనిట్‌కు 50 పైసల నుండి రూపాయి వరకు అదనపు చార్జీ విధించడం దారుణం. ఆ భారం చిల్లర దుకాణాల కొనుగోలుదార్లపైనే పడుతుంది. కోవిడ్ అనంతరం వ్యాపారాలు పుంజుకోక, మరోవైపు ఆర్థిక సంక్షోభంతో కొట్టుమిట్టాడుతున్న చిరువ్యాపారుల సంక్షేమానికి ప్రభుత్వం రక్షణ చర్యలు చేపట్టడం మాని ఇలా కరెంటు చార్జీలు పెంచడం తగదు. మోసపూరిత కండిషన్లు పెట్టి విద్యుత్ వినియోగదార్లకు ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లు అంటగట్టే కుట్ర ఇది. కేంద్రంలోని మోడీ సర్కారు తీసుకొచ్చిన ఆర్‌డిఎస్‌ఎస్ షరతులను టిడిపి కూటమి ప్రభుత్వం ఈ విధంగా అమలుకు పూనుకోవడం క్షంతవ్యం కాదు. మోడీ ప్రభుత్వ షరతుల అమలు, మరోవైపున అదానివంటి కార్పొరేట్లకు స్మార్ట్ మీటర్ల ద్వారా లబ్ధి చేకూర్చడమే రాష్ట్ర ప్రభుత్వ విధానంగా ఉంది. గత వైసిపి ప్రభుత్వం బాటలోనే కూటమి కూడా పయనించడాన్ని రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారు. అధికారం చేపట్టిన ఈ తొమ్మిది మాసాల్లో దాదాపు రూ.16 వేల కోట్ల విద్యుత్ భారాన్ని టిడిపి కూటమి ప్రభుత్వం విధించింది. ఇప్పుడు టిఒడి పేరిట విద్యుత్ చార్జీల పెంపును రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవడం అవశ్యం. ఆదాయాలు తరిగి, నిత్య జీవితావసరాల ధరలు పెరగడంతో ఇక్కట్ల పాలవుతున్న ప్రజలపై దొంగదెబ్బ తీసే ఇటువంటి చర్యలను జనం వ్యతిరేకించడం, నిరసనలు తెలపడం సహజం. ఆ పరిస్థితిని నివారించడం సర్కారు చేతుల్లోనే వుంది. విజ్ఞతతో వ్యవహరించాలి.

# అక్రమణ చెరలో దేవాలయ భూములు

నల్లగొండ, యదార్థవాది ప్రతినిధి, ఫిబ్రవరి 22: నల్లగొండ జిల్లాలో అనేక దేవాలయ భూములు ఆక్రమణకు గురయ్యాయి. కౌలుకు తీసుకున్న వారు కూడా చెల్లించడంలేదు. అలాగే అధికారులు కూడా గట్టిగా చర్యలు తీసుకోవడం లేదు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కూడా దేవాలయ భూములపై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇంత జరుగుతన్నా దేవాదాయ శాఖ అధికారుల దృష్టి పెట్టడం లేదు. సర్వే నంబర్లు మార్చి రైతుబంధు సహా అనేక పథకాలు పొందారు. దేవాదాయ భూముల పక్కనే ఉన్న సర్వే నెంబర్ వేసి రిజిస్ట్రేషన్ చేయించుకొని రైతుబంధు పథకం కూడా పొందారు. భూములను స్వాధీనంచేస్తే ఆయా దేవాలయాల్లో దూప, దీప నైవేద్యాలతో పాటు మహోత్సవాలను నిర్వహించేందుకు అవకాశం లభిస్తుందని పూజారులు ఆశపడుతున్నారు. ఆత్మకూర్(ఎస్) మండలం కందగట్ల లక్ష్మీనర్సింహ్మాస్వామి దేవాలయం పరిధిలో 654 ఎకరాల భూమి ఉంది. ముందుగా కౌలుకు చేశారు. ఆ తర్వాత కౌలు చెల్లించడం మానేశారు. ఏకంగా పక్కా భూముల సర్వే నెంబర్ వేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. దేవాలయం మొత్తం శిథిలావస్థకు చేరింది. అక్కడ దేవాలయ భూములను పరిరక్షించే వారు కరువయ్యారు. అర్వపల్లి మండల కేంద్రంలోని యోగానంద లక్ష్మీనర్సింహ్మాస్వామి ఆలయం పరిధిలో 750 ఎకరాల భూమి ఉండగా 650 ఎకరాల భూమి కౌలుకు తీసుకొని సేద్యం చేస్తున్నారు. సంవత్సరానికి రూ.500 మాత్రమే చెల్లించి కౌలు చేస్తున్నారు. మరో 100 ఎకరాలు అక్రమణకు గురయ్యాయి. ఎంతోమంది ఇళ్లు కట్టుకొని నివాసముం టున్నారు. రిజిస్ట్రేషన్లు కూడా మారిపోయాయి. మోతె మండలం ఉంద్రుగొండ లక్ష్మీనర్సింహ్మాస్వామి దేవాలయం కింద 100కు పైగా ఎకరాలు ఉండేది. కౌలుకు తీసుకున్న వారు ఏకంగా ఆక్రమించుకున్నారు. మద్దిరాల మండలం గోరెంట్ల వేంకటేశ్వరస్వామి, శివాలయాల కింద 150 ఎకరాల భూమి ఉంటే సుమారు 30 ఎకరాల భూమి అన్యాక్రాంతమైంది. నాగారం మండలంలోని ఫణిగిరి లక్ష్మీనర్సింహ్మాస్వామి దేవాలయం, శ్రీరామ ఆలయానికి సంబంధించిన భూముల ను కూడా పట్టాలు చేసుకున్నట్లు సమాచారం. చివ్వెంల మండలం దురాజ్‌పల్లి లింగమంతుల స్వామి గుడి కింద 26 ఎకరాల దేవాలయ భూమి ఉండగా 15 గుంటలు సబ్‌స్టేషన్ నిర్మాణానికి అందజేశారు. అది పోనూ మిగిలిన భూమిలో 5 ఎకరాల దాకా అన్యాక్రాంతమైనట్లు తెలుస్తుంది. చివ్వెంల మండలం ఉంద్రుగొండ ఫారెస్టు భూమి 2వేల ఎకరాలకు పైగా ఉండగా 100 ఎకరాల దాకా చుట్టు పక్కలా వారు అక్రమించు కున్నారు. పెన్‌పహాడ్ మండలంలోని నాగులపహాడ్ త్రికుతేశ్వర దేవాలయం కింద 4 ఎకరాల భూమి ఉండాల్సి ఉంది. కేవలం ఎకరం మాత్రమే ఉంది. పక్కా రైతులు అక్రమించుకొని పట్టాలు చేయించు కున్నారు. హుజుర్‌నగర్

## కోట్లు విలువ చేసే భూములకు పట్టాలు
## కదలని దేవాదాయ శాఖ అధికారులు

మండలం బూరుగడ్డ గ్రామంలోని వేణుగోపాలస్వామి దేవాలయం పరిధిలో 650 ఎకరాలుంటే 350 మంది రైతులు సేద్యం చేస్తున్నారు. ఎకరానికి రైతులు రూ.3వేలు కౌలు చెల్లిస్తున్నారు. దీనిలో కూడా 100 ఎకరాలు అన్యాక్రాంత మైనట్లు తెలుస్తుంది. మోతె మండలంలోని ఉర్లుగొండ లక్ష్మీనర్సింహ్మాస్వామి దేవాలయం పరిధిలో 80 ఎకరాల భూమి ఉండాలి. 15 ఎకరాల భూమి అన్యాక్రాంత మైంది. ఎస్సారెస్పీ కాల్వల కింద 6 ఎకరాల భూమి పోయింది. కౌలు కూడా కొంత మంది చెల్లించడం లేదని తెలుస్తుంది. అయితే వరుసగా విమర్శలు రావడంతో దేవాదాయ శాఖ ఇప్పుడిప్పుడే మేల్కొంటుంది. కబ్జాకు గురైన భూములను సంరక్షించుకోవాలని రాష్ట్ర వ్యాప్తంగా చర్యలు చేపట్టింది. దేవాలయాల సమీపంలో భూముల సర్వే నెంబర్లు బోర్డులపై రాసే కార్యక్రమం కొనసాగుతుంది. అక్రమించుకున్న వారు భూములను ఇవ్వకుంటే ఎండోమెంట్ ట్రిబ్యునల్ కోర్టుల్లో కేసులు నమోదు చేయాలని స్పష్టంగా ఆదేశాలు ఇచ్చారు.

# 55 మంది డాక్టర్ల తొలగింపు



విజయవాడ, యదార్థవాది ప్రతినిధి, ఫిబ్రవరి 22: ఏపీలో ఏకంగా 55 మంది ప్రభుత్వ వైద్యులను విధుల నుండి తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం 78 మందిలో 23 మంది ప్రభుత్వానికి సరియైన సమాధానం ఇవ్వగా, మిగిలిన వారిని విధుల నుండి తొలగించారు. ఒకేసారి భారీ సంఖ్యలో వైద్యులను తొలగించడం వెనుక పెద్ద కారణమే ఉంది. అదేమిటో తెలుసుకుందాం.కృష్ణా జిల్లా ఉయ్యూరుకు చెందిన మాజీ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ ఫిర్యాదు మేరకు ఈ చర్యలు తీసుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా, సెలవు పెట్టకుండా కొందరు వైద్యులు విధులకు డుమ్మా కొడుతూ.. వేతనాలు పొందుతున్నట్లు శ్రీనివాస్ గౌడ్ ఏకంగా లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుతో ప్రభుత్వం పలు మార్లు వైద్యులకు షోకాజ్ నోటీసులు కూడా జారీ చేసింది. మొత్తం 78 మంది వైద్యులు విధులకు గైర్హాజరు అవుతున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. వీరిలో కొందరు ప్రొఫెసర్లు కాగా, మరికొందరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు కావడం విశేషం. రోగులకు సేవలు అందించాల్సిన వీరు, విధులకు గైర్హాజరు కావడంపై లోకాయుక్తతో పాటు ప్రభుత్వం సీరియస్ గా పరిగణించింది.దీనితో 78 మంది ప్రొఫెసర్ అసోసియేట్ ప్రొఫెసర్ లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులకు 23 మంది స్పందించి సరియైన సమాధానం ఇచ్చినట్లు సమాచారం. మిగిలిన వారు సమాధానం ఇవ్వక పోవడంతో మరోమారు నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తోంది. ఆ నోటీసులకు కూడా ఎటువంటి సమాధానం ఇవ్వక పోవడంతో, చేసేదేమి లేక ప్రభుత్వం తగు చర్యలు తీసుకున్నట్లు సమాచారం. షోకాజ్ నోటీసులకు స్పందించని 55 మందిని విధుల నుండి ప్రభుత్వం తొలగించింది. ఈ మేరకు 55 మందిని తొలగించినట్లు లోకాయుక్తకు ప్రభుత్వం సమాచారం అందజేసింది.కాగా ఖాళీగా ఉన్న పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసే చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం. సాధ్యమైనంత త్వరగా భర్తీ చేసి, రోగులకు ఇబ్బంది కలగకుండా చూసేలా ప్రభుత్వం కృషి చేయనుంది. మొత్తం మీద 2023లో అందిన ఫిర్యాదు మేరకు లోకాయుక్త తీసుకున్న చొరవతో విధులకు గైర్హాజరు అవుతున్న 55 మందిని విధుల నుండి తొలగించడం ఇప్పుడు సంచలనంగా మారింది. ఎట్టకేలకు రెండేళ్ల తర్వాత చర్యలు తీసుకున్నారని, ఇలాంటి వైద్యులపై ప్రభుత్వం ఓ కన్నేసి ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.వైద్యో నారాయణో హరి అంటారు. వైద్యుడు దేవుడితో సమానంగా భావించే సమాజంలో ఉంటూ.. విధుల పట్ల అశ్రద్ధ వహించే వైద్యులపై చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ ఇప్పుడు వినిపిస్తోంది. అసలే రానున్నది ఎండా కాలం. వడదెబ్బ సోకే అవకాశాలు ఎక్కువ. అలాగే పలు రకాల వ్యాధుల భయం కూడా ప్రజల్లో ఉన్న పరిస్థితుల్లో వైద్య ఆరోగ్య శాఖ వైద్యశాలల తీరుతెన్నులపై ఓ నిఘా ఉంచాలని, అర్హత లేకుండా వైద్యం చేసే వ్యక్తులను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## ఎస్జీఎఫ్ జాతీయ,రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను అభినందించిన మంత్రి శ్రీధర్ బాబు



మంథని, యదార్థవాది ప్రతినిధి, ఫిబ్రవరి 22: మహారాష్ట్ర లోని ఔరంగాబాద్ లో జరిగిన 68వ నేషనల్ స్కూల్ గేమ్స్ లో అండర్ 17 టెన్నిస్ విభాగంలో మంథని కృష్ణవేణీ హై స్కూల్ లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి ఎండీ సీరాజ్ హుస్సేన్ ను, రాష్ట్రస్థాయిలో హైదరాబాద్ లో జరిగిన ఎస్జీఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీలలో అండర్ 17 టెన్నిస్ విభాగంలో పాల్గొన్న ఇదే పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థి శక్తి స్వరూప్, 9వ తరగతి చదువుతున్న సాత్విక్ లను రాష్ట్ర ఐటి,పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అభినందించారు. శనివారం మంథని పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో విద్యార్థులు ఎస్జీఎఫ్ సెక్రటరీ కొమురోజు శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంత్రి శ్రీధర్ బాబును కలిశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు విద్యార్థులు సాధించిన పత్రాలను పరిశీలించి విద్యార్థులను అభినందించారు. మరిన్ని పోటీలలో పాల్గొని చదివిన పాఠశాలకు, ఉన్న ఊరుకు పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం ఎండి జాఫర్, సుదర్శన్ రెడ్డి లతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కమాన్‌పూర్, యదార్థవాది ప్రతినిధి, ఫిబ్రవరి 22: పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం పన్నూరు లో నివాసం ఉంటున్న నిరుపేద కుటుంబానికి చెందిన జక్కుల రాజయ్య పోసాని కూతురు లాస్య పెళ్లికి సింగరేణి బలగం వారు 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. విషయం మరియు వారి ఆర్థిక పరిస్థితి సింగరేణి యువ బలగం దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించిన జిడికె 11ఇంక్లైన్ లో ఎలక్ట్రీషియన్ గా పనిచేస్తున్న ఆరెపల్లి బాలకృష్ణ వారి జన్మదినం సందర్భంగా సింగరేణి యువ బలగం ఆధ్వర్యంలో వారి కుటుంబానికి సెంటిన రీకాలనీ లోని సింగరేణి సెక్యూరిటీ కార్యాలయం వద్ద శ్రీ శ్రీ తయంబకేశ్వర ఆలయంలో పెళ్లి జరగగా అక్కడే 50కిలోల బియ్యం అందజేసి, నూతన వధూవరులను ఆశీర్వదించడం జరిగింది. మీరు కూడా మీ సంతోషకరమైన కార్యక్రమాలలో తోటి వారికి సహాయం చేసి పెద వారికి సాయపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సింగరేణి యువ బలగం ప్రతినిధులు బుడిగే క్రాంతి,మంద సురేష్,సమ్మయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలలో పర్యటించిన డైరెక్టర్ పి అండ్ పి



కమాన్‌పూర్, యదార్థవాది ప్రతినిధి, ఫిబ్రవరి 22: సింగరేణి సంస్థ డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ కొప్పుల వెంకటేశ్వర్లు శనివారం పెద్దపల్లి జిల్లా రామగుండం సింగరేణి సంస్థ డివిజన్ 3 అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలో పర్యటించారు. నూతనంగా డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ గా పదవి భాధ్యతలను స్వీకరించి మొదటి సారిగా జి.యం. కార్యాలయానికి విచ్చేసిన వారిని అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వర రావు ఇతర అధికారులు సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సంబధిత అధికారులతో అడ్రియాల లాంగ్ వాల్ ప్రాజెక్ట్ సంబంధించిన సాల్వేజింగ్ పనులు తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజినీర్ కె.యాదయ్య, ఎస్వోటు జియం బండి సత్యనారాయణ, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, అధికారులు రాజేంద్ర కుమార్, టి.రఘురాం, పి.డి.సుధాకర్, షబిరుద్దీన్, రాజేశం, మతీన్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన.. ఎమ్మెల్యే దొంతి



నర్సంపేట, యదార్థవాది ప్రతినిధి, ఫిబ్రవరి 22: నల్లబెల్లి మండలం గుండ్లపహాడ్ గ్రామ మాజీ సర్పంచ్ కడ్దూరి కట్టయ్య కుమారుడు నాగరాజు హారిక వధూవరులను ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆశీర్వదించి అక్షింతలు వేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ ను సవరించాలి



మంథని, యదార్థవాది ప్రతినిధి, ఫిబ్రవరి 22: సీఐటీయూ రైతు సంఘం వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ కార్మిక కర్షకుల పై ప్రభావం అనే అంశంపై మంథని మునిసిపాలిటీ ఆవరణంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేష్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సీ ఐ టీ యూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్లో కార్మిక కర్షకులకు తీవ్రమైన అన్యాయం చేసిందని అన్నారు కార్మికుల కలిసవేతనాల ఊసే లేదని రైతులకు కనీసం మద్దతు ధర చట్టం గురించి ప్రస్తావించలేదని వ్యవసాయ కూలీలకు సమగ్ర చట్టం చేయాలనే డిమాండ్ ను పక్కన పెట్టి కార్మిక రంగాన్ని వ్యవసాయ రంగాన్ని వ్యవసాయ కూలీల బతుకు లను కూని చేసిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాపెల్లి తిరుపతి సీ ఐ టీ యూ నాయకులు రాజు రైతు సంఘం నాయకులు ఆకుల శ్రీనివాస్ నాయకులు మంథని కిష్టయ్య మల్లేష్ చందు గట్టయ్య తదితరులు పాల్గొన్నారు..

# చిరంజీవి హీరోగా నాని చిత్ర నిర్మాణం

## కోర్ట్ సినిమా అద్భుతంగా ఉంటుందని వెల్లడి

చిరంజీవి కథానాయకుడిగా నాని ఓ సినిమా నిర్మించనున్నారు. 'దసరా' ఫేం శ్రీకాంత్ ఓదెల ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం ఆయన నానితో 'ప్యారడైజ్'సినిమా చేస్తున్నారు. ఆ సినిమా పూర్తయ్యాక చిరంజీవి సినిమా మొదలుపెట్టే అవకాశం ఉందని చాలాకాలంగా టాక్ నడుస్తోంది. తాజాగా ఈ సినిమా గురించి నిర్మాతగా నాని ఆసక్తికర అప్‌డేట్ ఇచ్చారు. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రం వచ్చే ఏడాది చిత్రీకరణ ప్రారంభించుకోనుందని నాని స్వయంగా వెల్లడించారు. శుక్రవారం జరిగిన 'కోర్ట్' సినిమా కార్యక్రమంలో నాని మాట్లాడుతూ ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రియదర్శి ప్రధాన పాత్రలో రామ్ జగదీశ్ దర్శకుడిగా నాని సమర్పణలో 'కోర్ట్' సినిమా తెరకెక్కింది. ప్రశాంతి తిపిర్నేని నిర్మాత. హర్ష్ రోషన్, శ్రీదేవి జంటగా నటించారు. మార్చి 14న ప్రేక్షకుల ముందుకు రానుందీ సినిమా. ఈ నేపథ్యంలో నాని ప్రచార కార్యక్రమాలు మొదలుపెట్టారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఫస్ట్ హియరింగ్ విత్ మీడియా పేరుతో ఓ కార్యక్రమం ఏర్పాటు చేసి సినిమా విశేషాలు చెప్పుకొచ్చారు.'అందమైన ప్రేమకథ.. బలమైన డ్రామా.. గొప్ప సందేశం.. అన్నీ ఉన్న చిత్రం 'కోర్ట్: ది స్టేట్ వర్సెస్ నోబడీ'. దీని విషయంలో నేను అందరికీ ఓ మాట ఇస్తున్నా. సినిమా పూర్తయ్యే సరికి థియేటర్లలో ఉన్న ప్రతి ఒక్కరూ కచ్చితంగా లేచి నిలబడి చప్పట్లు కొడతారని నమ్ముతున్నానని అన్నారు కథానాయకుడు నాని. ఆయన సమర్పణలో ప్రియదర్శి ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రాన్ని రామ్ జగదీశ్ తెరకెక్కించారు. హర్ష్ రోషన్, శ్రీదేవి జంటగా నటించారు. శివాజీ, సాయికుమార్, హర్ష వర్ధన్, రోహిణి తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. ఈ సినిమాలో స్పృశించిన అంశం చాలా సున్నితమైనది. ఇలాంటి కథలు చెప్పేటప్పుడు చిన్న ఒత్తు, పొల్లు కూడా పక్కకు పోకూడదు. అందుకే దర్శకుడు జగదీశ్ దీనికోసం చాలా రీసెర్చ్ చేశాడు. అలాగే హర్ష - శ్రీదేవి నటన.. వాళ్ల అందమైన ప్రేమకథ అందర్నీ ఆకట్టుకుంటుంది. ఈ సినిమా పూర్తయ్యే సరికి తప్పకుండా అందరికీ పోక్సో చట్టం గురించి ఓ అవగాహన వస్తుంది. ఇది తప్పకుండా పెద్ద బ్లాక్‌బస్టర్ అవ్వాలని కోరుకుంటున్నానని అన్నారు. తెలుగు రాష్ట్రాల్లోని కొన్ని వాస్తవ సంఘటనల్ని.. దాని తాలూకూ కేసుల్ని ఆధారం చేసుకుని ఫిక్షనల్‌గా ఈ చిత్ర కథను అల్లుకున్నాం. నాని నిర్మాణంలో చేయడం వల్ల ఇది మరింత ఎక్కువ మందికి చేరువ చేసే అవకాశం దొరికింది. పోక్సో చట్టానికి సంబంధించిన ఓ సున్నిత అంశాన్ని ఈ సినిమాలో చర్చించనున్నామని అన్నారు దర్శకుడు రామ్ జగదీశ్. నటుడు ప్రియదర్శి మాట్లాడుతూ.. నాకు కోర్టు రూం డ్రామా చిత్రాలంటే చాలా ఇష్టం. ఈ కథ విన్నప్పుడు అందరికీ స్ఫూర్తినిచ్చే సినిమా అవుతుందనిపించింది. దీన్ని చూశాక తప్పకుండా న్యాయ వ్యవస్థపైనా.. న్యాయవాదులపైనా గౌరవం రెట్టింపవుతుందని నమ్ముతున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో హర్ష్ రోషన్, దీప్తి గంటా, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.




# ఈడీ తీరుపై మండిపడ్డ దర్శకుడు శంకరన్

## ఆస్తుల అటాచ్‌మెంట్ అక్రమమని వెల్లడి



కోలీవుడ్ ప్రముఖ దర్శకుడు శంకర్ కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ షాక్ ఇచ్చిన విషయం తెలిసిందే. 'ఎంథిరన్' సినిమాకు సంబంధించి నమోదైన కాపీరైట్ ఉల్లంఘన కేసులో శంకర్‌కు చెందిన దాదాపు రూ.10 కోట్ల విలువైన మూడు స్థిరాస్తులను ఈడీ అటాచ్ చేయడంపై ఆయన మౌనం వీడారు. ఈడీ చర్యలపై ఆయన అసంతృప్తి వ్యక్తంచేశారు. కోర్టు తీర్పును పక్కనపెట్టి ఈడీ ఇలాంటి చర్యలకు పాల్పడటం తనని ఎంతగానో బాధించిందని ఆయన పేర్కొన్నారు. చెన్నై జోనల్ కార్యాలయం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తీసుకున్న చర్యలను ఉద్దేశించి పలు విషయాలను ప్రేక్షకుల దృష్టికి తీసుకురావాలనుకుంటున్నా. 'ఎంథిరన్' చిత్రానికి సంబంధించి నిరాధారమైన ఆరోపణలను ఆధారంగా చూపించి నాకు సంబంధించిన మూడు స్థిరాస్తులను తాత్కాలికంగా అటాచ్ చేశారు. ఈ చర్య న్యాయపరమైన వాస్తవాలను తప్పుదోవ పట్టించడమే కాకుండా చట్ట ప్రక్రియ దుర్వినియోగాన్ని సూచిస్తుంది. 'ఎంథిరన్' కాపీరైట్ కేసుకు సంబంధించి ఇప్పటికే హైకోర్టు క్షుణ్ణంగా విచారణ జరిపి తీర్పునిచ్చిన విషయాన్ని హైలైట్ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సాక్ష్యాధారాలు, ఇరు పక్షాల వాదనలు విన్న న్యాయస్థానం 'ఎంథిరన్' చిత్రానికి సంబంధించిన అసలైన హక్కులు తనకే ఉన్నాయంటూ అరూర్ తమిళనాథన్ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. ఈ కేసుపై ఇప్పటికే న్యాయస్థానం తీర్పునిచ్చినప్పటికీ, ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌టీఐఐ) ఇచ్చిన నివేదికను ఆధారంగా చేసుకొని ఈవిధంగా ఈడీ నా ఆస్తులను అటాచ్ చేసింది. కాపీరైట్ ఉల్లంఘన అనేది జరగలేదని న్యాయస్థానం ఇచ్చిన తీర్పును పక్కనపెట్టి ఇలా చర్యలు తీసుకోవడం నన్నెంతో బాధించింది' అని ఆయన పేర్కొన్నారు. తన కథ 'జిగుబా'ను కాపీ కొట్టి శంకర్ 'ఎంథిరన్' సినిమా తెరకెక్కించారంటూ అరూర్ తమిళనాథన్ అనే వ్యక్తి 2011లో కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. శంకర్ కాపీరైట్ చట్టాన్ని ఉల్లంఘించారని పిటిషన్‌లో పేర్కొన్నారు. మరోవైపు, ఈ కేసు విషయమై ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌టీఐఐ) నివేదిక కూడా శంకర్‌కు వ్యతిరేకంగా వచ్చింది. జిగుబా కథకు, రోబో సినిమాకు మధ్య చాలా పోలికలు ఉన్నాయని తెలిపింది. శంకర్ కాపీరైట్ చట్టంలోని సెక్షన్ 63ని ఉల్లంఘించినట్లు ఆ వివరాల ఆధారంగా ఈడీ స్పష్టం చేసింది. ఈ కేసులో తదుపరి దర్యాప్తు జరుగుతోందని పేర్కొంది.

# ఛావాకు మోడీ ప్రశంసలు

## సంతోషాన్ని వెల్లడించిన నటుడు విక్కీ కౌశల్



విక్కీకౌశల్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ఛావా' పై ప్రధాని మోదీ ప్రశంసలు కురిపించడంపై నటుడు విక్కీ కౌశల్ ఆనందం వ్యక్తంచేశారు. తమ చిత్రాన్ని ప్రశంసించిన ప్రధానికి ధన్యవాదాలు చెప్పారు. సంతోషంతో మాటలు రావడం లేదని తెలుపుతూ ఇన్‌స్టా వేదికగా పోస్ట్ పెట్టారు. ఒక చారిత్రక గౌరవం. గౌరవనీయులైన ప్రధాని నరేంద్రమోదీ ఛావాను ప్రశంసించడం, ఛత్రపతి శంభాజీ మహారాజ్ త్యాగాన్ని కీర్తించడం గర్వించదగిన గొప్ప క్షణం అని పేర్కొన్నారు. 98వ అఖిల భారత మరాఠీ సాహిత్య సమ్మేళనం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'ఛావా' చిత్రాన్ని ఉద్దేశించి మాట్లాడారు. హిందీ సినిమాతో పాటు మరాఠీ చిత్రాల స్థాయిని పెంచడంలో మహారాష్ట్ర, ముంబయి కీలకపాత్ర పోషించింది. కొత్త సినిమా 'ఛావా' ప్రస్తుతం అంతటా ఆదరణ సొంతం చేసుకుంది. శివాజీ సావంత్ మరాఠీ నవల వల్లే ఈ శంభాజీ మహారాజ్ వీరత్వాన్ని చిత్ర రూపంలో పరిచయం చేయడం సాధ్యమైందని అన్నారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ కుమారుడు శంభాజీ మహారాజ్ జీవితాధారంగా రూపొందిన చిత్రమే 'ఛావా'. శంభాజీ మహారాజ్‌గా విక్కీ కౌశల్, ఆయన భార్య యేసుబాయి పాత్రలో రష్మిక నటించారు. శంభాజీ కథలో కీలకమైన ఔరంగజేబు పాత్రను అక్షయ్ ఖన్నా పోషించారు. ఫిబ్రవరి 14న సినిమా ప్రేక్షకుల ముందుకువచ్చి విశేష ఆదరణను సొంతం చేసుకుంది. విక్కీ కౌశల్ యాక్టింగ్‌కు సినీ ప్రముఖులు సైతం ఫిదా అవుతున్నారు. విక్కీ అద్భుతంగా నటించారంటూ ప్రశంసిస్తున్నారు. విడుదలైన తొలి వారంలో ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా రూ. 300 కోట్లకు పైగా వసూలుచేసినట్లు విశ్లేషకుల అంచనా.







# ఓదెల-2లో నాగసాధుగా తమన్నా

మిల్కీ బ్యూటీ తమన్నా ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం ఓదెల 2 ఓదెల రైల్వే స్టేషన్ సినిమాకు సీక్వెల్‌గా ఈ సినిమా రాబోతుంది. సూపర్‌నాచురల్ థ్రిల్లర్‌గా రాబోతున్న ఈ సినిమాకు టాలీవుడ్ దర్శకుడు సంపత్ నంది కథను అందిస్తుండగా.. అశోక్ తేజ దర్శకత్వం వహిస్తున్నాడు. మధు క్రియేషన్స్ మరియు సంపత్ నంది టీమ్‌వర్క్స్ బ్యానర్లపై డి. మధు నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో తమన్నా ఒక నాగ సాధువు పాత్రలో కనిపించనుంది. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం నుంచి మేకర్స్ టీజర్ విడుదల చేశారు. ఈ టీజర్ చూస్తుంటే..ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాలో ఈ సినిమా టీజర్‌ను మేకర్స్ విడుదల చేశారు. టీజర్ చూస్తుంటే.. ఓదెల గ్రామాన్ని దుష్ట శక్తుల నుంచి నాగ సాధువు అయిన తమన్నా ఎలా రక్షిస్తుంది అనే కథాంశంతో ఈ సినిమా రాబోతుంది. ఇక టీజర్ బ్యాక్‌గ్రౌండ్‌లో వినిపించే శివ భక్తి గీతం గుస్ బంప్స్ తెప్పించేలా ఉండగా.. తమన్నా యొక్క నాగ సాధువు లుక్, ఆమె తీవ్రమైన యాక్షన్ సన్నివేశాలు టీజర్‌లో హైలైట్‌గా నిలిచాయి.



EDITOR, PRINTED, PUBLISHED AND OWNER, BINGI SATHAIAH YAADHARTHAVAADHI TELUGU DAILY, PRINTED AT MEGHA PRINTERS, H NO.11-52, INDIRA NAGAR, SIDDIPET-502103, YAADHARTHAVAADHI@GMAIL.COM TELTEL/02022, RNI/2023/85376 # 11-52, INDIRA NAGAR PRASHANTH NAGAR, SIDDIPET-502103, PUBLISHED FROM: H NO.11-52, INDIRA NAGAR, SIDDIPET-502103, TELANGANA STATE. CELL:8500765666, 9491330519.